# వర్కింగ్ జర్నలిస్ట్

సమాచార స్రవంతి

సంపుటి: 15 సంచిక: 4 మే 2026 వెల: రూ5/-



# జర్నలిస్టు జగన్ దారుణ హత్య






# ఇద్దరు భారతీయ పాత్రికేయులకు పులిట్జర్

పాత్రికేయులకు నోబెల్‌గా భావించే ప్రపంచ ప్రఖ్యాత పులిట్జర్ పురస్కారం ఇద్దరు భారతీయ జర్నలిస్టులను వరించింది. డిజిటల్ యుగంలో పెరుగుతున్న నిఘా, సైబర్ మోసాలపై వారు చేసిన అద్భుతమైన పరిశోధనాత్మక కథనాలకు ఈ గుర్తింపు లభించింది. భారతీయ జర్నలిస్టులు ఆనంద్ ఆర్కే, సుపర్ణా శర్మ ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని దక్కించుకున్నారు. ప్రముఖ అంతర్జాతీయ మీడియా సంస్థ బ్లూమ్‌బెర్గ్‌కు చెందిన నటాలీ ఒబికో పియర్సన్‌తో కలిపి వీరు ఈ అవార్డును పంచుకోనున్నారు. జర్నలిజంలో అత్యున్నత పురస్కారమైన పులిట్జర్‌ను వీరు ఇలస్ట్రేటెడ్ రిపోర్టింగ్, కామెంటరీ విభాగంలో గెలుచుకున్నారు. డిజిటల్ నిఘా, అంతర్జాతీయ సైబర్ మోసాలకు సంబంధించిన సంక్లిష్టమైన అంశాలను సామాన్యులకు అర్థమయ్యేలా చిత్రాలతో వివరించినందుకు ఈ గౌరవం దక్కింది. ఈ అవార్డులను అమెరికాలోని కొలంబియా విశ్వవిద్యాలయానికి చెందిన పులిట్జర్ బోర్డు ప్రకటించింది. వీరు చేసిన పరిశోధన అంతర్జాతీయ స్థాయి సైబర్ నేరాల నెట్‌వర్క్‌ను వెలుగులోకి తెచ్చింది. నేటి సమాజంలో ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్న డిజిటల్ నిఘా పద్ధతులు, అమాయకులను ముంచేస్తున్న సైబర్ మోసాల వెనుక ఉన్న వాస్తవాలను వీరు విస్తృతంగా వెలుగులోకి తెచ్చారు. బ్లూమ్‌బెర్గ్ బృందంతో కలిసి నిరంతరం వీరు క్షేత్రస్థాయిలో పర్యటించి, సాంకేతిక ఆధారాలను సేకరించారు. అత్యున్నత ప్రమాణాలతో కూడిన రిపోర్టింగ్. గ్రాఫికల్ ఇలస్ట్రేషన్ల ద్వారా ఈ నివేదికలను రూపొందించి ప్రచురించారు. వీరి కృషి పాత్రికేయ ప్రపంచంలో సరికొత్త ప్రమాణాలను నెలకొల్పింది. అంతర్జాతీయ రిపోర్టింగ్ కేటగిరీలో మరో భారతీయ జర్నలిస్టు అనిరుధ్ ఘోషల్ పులిట్జర్ ప్రైజ్ గెలిచారు. అమెరికా బోర్డర్ పెట్రోలింగ్ పోలీసులకు చెందిన నిఘా వ్యవస్థల టెక్నాలజీ గురించి పరిశోధన చేశారు.



రంపచోడవరంలో జరుగుతున్న పోలవరం జిల్లా ఫెడరేషన్ మహాసభకు గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి రాజేశ్వరిని ఆహ్వానిస్తున్న ఫెడరేషన్ ప్రతినిధులు




రంపచోడవరంలో జరిగిన పోలవరం జిల్లా ఫెడరేషన్ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక శాసనసభ్యులు మిరియాల శిరీష, వేదికపై ఫెడరేషన్ ప్రతినిధులు

# వర్కింగ్ జర్నలిస్ట్ సమాచార స్రవంతి

**సంపుటి: 15 మే 2026 సంచిక: 4**


## లోపలి పేజీల్లో...


జర్నలిస్టు అవార్డుల విధివిధానాల రూపకల్పనకు కమిటీ ...... 4
జర్నలిస్టు జగన్ దారుణ హత్య ............ 5
సోషల్ మీడియా దుర్వినియోగంపై ఉక్కుపాదం ............... 7
అమెరికన్ జర్నలిస్టు కిడ్నాప్, విడుదల ....................... 8
జర్నలిస్టుతో కాళ్ళు మొక్కించుకున్న మహిళ ........... 9
జగన్ హత్యతో వెల్లువెత్తిన నిరసన ......................... 11
విశాఖలో కదం తొక్కిన జర్నలిస్టులు ...................... 14
రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ క్యాంపులు .................... 15
జర్నలిస్టుల సంక్షేమానికి కృషి ---------------- 16
విలువల పరిరక్షణ పత్రికలతోనే సాధ్యం ................ 17
చిగురుటాకులా వణికిన నాలుగో స్తంభం ....... 22
జర్నలిస్టులకు సంపూర్ణ సహకారం ...... 28



**సంపాదకులు**

**ఎ.అమరయ్య**

**వర్కింగ్ ఎడిటర్స్**

**ఎన్.కొండయ్య** **ఎం.ఎ.రవూఫ్**

**సంపాదకవర్గం**

| | |
|---|---|
| జి.ఆంజనేయులు | ఎస్.వెంకట్రావు |
| వి.నవీన్‌రాజ్ | ఎమ్. శ్రీనివాస్ |
| బి.ఎన్.ప్రసాదరావు | వి.గోపి |
| వి.రామారావు | ఆర్.రామాంజనేయులు |
| బి. ఈశ్వరరావు | కె.వేణుగోపాలరావు |
| వి.భక్తవత్సలం | ఒ.శాంతి |
| ఎస్.మురళీశంకర్ | కె.ఎస్.శంకరరావు |
| జి. శీనుబాబు | డి.మధుసూదనరావు |

**డిప్యూటీ ఎడిటర్: జిలాని ఎస్.ఎం**



**PUBLISHED, PRINTED AND EDITED BY**
**G. Anjaneyulu on behalf of**
**Andhra Pradesh Working**
**Journalists Federation**
H. No.1-7-9/A, Plot No.40, 402, Surabhi Sapphire, Golconda 'X' Roads, Musheerabad, Hyderabad-500 020, A.P.

**PRINTED AT**
**Prajashakthi,** M.B. Bhavan, Near RTC Cross Roads, Hyderabad-500 020.

**EDITOR**
**A.Amaraiah**
e-mail:editorworkingjournalist@gmail.com,
Cell: 9347921291
RNI No. APMUL/2009/37690


# నిజం చెబితే చంపేస్తారా?!

నిజం చెప్పడం నేరమవుతోంది. అందుకు శిక్ష ప్రాణాలను పణంగా పెట్టాల్సి వస్తోంది. లేదా కాళ్ళు పట్టుకుని క్షమాపణ వేడుకోవాల్సి వస్తోంది. లేదు బెదిరింపులు, దాడులకు సిద్ధం కావాల్సి వస్తోంది. ప్రపంచవ్యాప్తంగా జర్నలిస్టులు, మీడియా సంస్థలు మే3వ తేదీ ప్రపంచ పత్రికాస్వేచ్ఛా దినోత్సవాన్ని పాటిస్తోంది. స్వేచ్ఛ మాటేమో గానీ నిజాలు రాసినందుకు పలమనేరు నియోజకవర్గం వి.కోటలో ఎబిఎన్-ఆంధ్రజ్యోతికి విలేకరిగా పనిచేసిన జగన్మోహన్‌రెడ్డి అసువులు కోల్పోయారు. అనంతపురంలో హనీట్రాప్ కేసులోని నిందితులతో సంబంధాలున్న పెద్దవారి పేర్లు ప్రస్తావించినందుకు కాళ్ళు పట్టుకుని క్షమాపణ వేడుకోవాల్సి వచ్చింది. అందులోనూ భార్యాబిడ్డల ముందు నేరస్తునిలా తల దించుకోవాల్సిన స్థితి. జర్నలిస్టుగా పనిచేయాలంటే ఇలాంటి విపత్కర పరిస్థితులన్నింటినీ ఎదుర్కొనక తప్పదని ఈ వృత్తిలోకి అడుగుపెట్టిన రోజునే గ్రహించి ఉంటారు. పత్రికాస్వేచ్ఛ సూచీలో మనదేశం స్థానం 151లో ఉన్నదంటేనే పరిస్థితి తీవ్రత ఎంతగా ఉన్నదో అర్థమవుతోంది. ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామిక దేశంలో సమాచారాన్ని ప్రజలకు చేరవేసేందుకు జర్నలిస్టులు అనుభవిస్తున్న కష్టాలివి. పెరుగుతున్న సాంకేతిక శాస్త్ర పరిజ్ఞానం జర్నలిస్టుల కష్టాలను తగ్గిస్తుందని ఆశపడితే అవి మరింతగా పెరిగాయి. పరస్పర విరుద్ధమైన చట్టాలతో మరింత గందరగోళ పరుస్తున్నారు. సమాచార హక్కు చట్టం అన్ని రకాల సమాచారాన్ని అందరికీ అందుబాటులో ఉంచాలని చెబుతోంది. ఐటి చట్టం మాత్రం వ్యక్తిగత గోప్యత పేరుతో అక్రమంగా కేసులు బనాయించేందుకు బాటలు వేస్తోంది. ఈ చట్టంలోని కొన్ని అంశాలపై జర్నలిస్టులకు మినహాయింపు ఇవ్వాలి, లేదా ఎటువంటి మార్గదర్శకాలు పాటించాలో తెలియజేయమని ఎడిటర్స్ గిల్డ్ అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చే నాథుడే కరువయ్యాడు. జర్నలిస్టులకు, మీడియా రెండూ ఒకటి కావని, వేర్వేరని మెల్లమెల్లగా జర్నలిస్టులు అర్థం చేసుకుంటున్నారు. వ్యాపార ప్రయోజనాలను కాపాడుకునేందుకు మీడియా పనిచేస్తుంటే ప్రజాబాహుళ్యానికున్న సమస్యలను మొత్తం సమాజం ముందుంచేందుకు, వాటి పరిష్కారానికి తన వంతు బాధ్యత నిర్వర్తించేందుకు, ఒక్క మాటలో చెప్పాలంటే నిజం కోసం నిలబడేందుకు జర్నలిస్టు నానా తపన పడాల్సి వస్తున్నది. కనీసం జర్నలిస్టులను దాడుల నుంచి కాపాడుకునేందుకు, వాటి నివారణకు గల అవకాశాలను అమలుచేసేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిలో హైపవర్ కమిటీ, జిల్లా స్థాయిలో కమిటీల ఏర్పాటుకు వీలుంది. వాటిని నియమించేందుకు ప్రభుత్వాలు సిద్ధం కావడం లేదు. పోరాడి సాధించుకున్న చట్టాలను అమలు చేయించుకునేందుకు మరో పోరాటం మినహా గత్యంతరం లేదు.

# జర్నలిస్టు అవార్డుల విధివిధానాల రూపకల్పనకు కమిటీ

సుదీర్ఘకాలం అనంతరం జర్నలిస్టులకు అవార్డులు ఇచ్చేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విధివిధానాలు రూపొందించే కమిటీని నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీ నియామకం పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ హర్షం వ్యక్తం చేస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో నిలిచిపోయిన ఇప్పటివరకు జర్నలిస్టుల అవార్డుల గురించి పట్టించుకోని స్థితి ఉంది. ఈ విషయమై స్పందించి ఈ కమిటీ నియమించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఫెడరేషన్ కృతజ్ఞతలు తెలియ చేస్తోంది.

ఈ కమిటీలో ఐదుగురు సభ్యులున్నారు. మీడియా అకాడెమీ చైర్మన్ అధ్యక్షులుగా వ్యవహరిస్తారు. ఇండియా టుడే పూర్వ సంపాదకులు ఎ.ఎ.వి.ప్రసాద్, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వైస్‌ఛాన్సలర్‌గా, ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా ఉన్న విద్యావేత్త ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తి, సమాచార శాఖ డైరెక్టర్ సభ్యులుగా ఉంటారు. సమాచార శాఖ డైరెక్టర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఈ కమిటీ 2025-26 సంవత్సరానికి జర్నలిస్టు అవార్డులకు అర్హులైన వారి పేర్లను పరిశీలించి ప్రతిపాదిస్తుంది. అదేవిధంగా జర్నలిస్టుల అవార్డులకు సంబంధించి రాష్ట్రం విడిపోయిన నేపథ్యంలో 2004 జనవరి 28న జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులను సమీక్షించి అవార్డుల పేర్లకు సంబంధించిన మార్పులను సూచిస్తుంది. ఆంధ్రప్రదేశ్ కలిసి ఉన్న సమయంలో జర్నలిస్టులకు పలువురు ప్రముఖ జర్నలిస్టుల పేరిట అవార్డులు ఉన్నాయి. ఉన్న అవార్డులకు తోడుగా జర్నలిస్టు ఉద్యమ పితామహుడు మానికొండ చలపతిరావు, సీనియర్ సంపాదకులు చక్రవర్తుల రాఘవాచారి, పొత్తూరి వెంకటేశ్వరరావు, ప్రముఖ కార్టూనిస్ట్ టి మోహన్ల పేరిట అవార్డులు ఇచ్చే ప్రతిపాదన పరిశీలించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎస్.వెంకట్రావు, జి.ఆంజనేయులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రింట్, బ్రాడ్ కాస్ట్ మీడియాలలో పనిచేస్తున్న వివిధ జర్నలిస్టు విభాగాల అన్నిటికీ ప్రాతినిధ్యం ఉండేలా అవార్డులు ఉండాలని విజ్ఞప్తి చేశారు.

# వర్కింగ్ జర్నలిస్టుల ఆరోగ్య బీమా మరో ఏడాది పొడిగింపు

రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు అమలు చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల హెల్తు స్కీమ్‌ను మరో ఏడాది అనగా 2026-27 కు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరవ్ గౌర్ జిఓఎంస్ సంఖ్య 43 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జిఓం ఎంస్ సంఖ్య 12 ద్వారా 2015లో అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్టులు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా అదే విధంగా ఫ్రీలాన్స్,వెటరన్ జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య పథకం మాదిరిగా వివిధ ఎంపానల్డ్ ఆసుపత్రుల ద్వారా గుర్తింపు పొందిన అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా ఎటువంటి నగదు చెల్లించాల్సిన అవసరం లేకుండా క్యాస్ లెస్ వైద్య సేవలు అందించే లక్ష్యంతో వర్కింగ్ జర్నలిస్టుల హెల్తు స్కీమ్‌ను ప్రవేశపెట్టడం జరిగింది. దీర్ఘకాలిక వ్యాధులు, అత్యవసర శస్త్రచికిత్సలతో సహా ప్రభుత్వం నిర్ణయించిన వందలాది వైద్య విధానాలు ఈ పథకం కింద కవర్ చేయబడతాయి. కాలానుగుణంగా ఈపథకాన్ని ప్రతి ఏటా అనగా 2016-17 నుండి 2025-26 వరకూ పొడిగించడం జరిగింది. మరలా ఈవర్కింగ్ జర్నలిస్టుల కాంప్రెహెన్సివ్ హెల్తు స్కీమ్‌ను మరో ఏడాది కాలానికి అనగా 2026-27కు పొడిగించాలన్న సాధారణ పరిపాలన శాఖ(ఐఅండ్ పిఆర్)విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈనెల 1వ తేదీ నుండి వచ్చే ఏడాది మార్చి 31 వరకూ పొడిగిస్తూ నిర్ణయం తీసుకుని ఆమేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

వర్కింగ్ జర్నలిస్టుల హెల్తు స్కీమ్ పొడింగింపు ఉత్తర్వులకు అనుగుణంగా వెంటనే తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి డా.ఎన్టిఆర్ వైద్య సేవ ట్రస్ట్, సంచాలకులు సమాచార పౌర సంబంధాల శాఖ చర్యలు తీసుకోవాల్సిందిగా వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరవ్ గౌర్ ఆఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జర్నలిస్టుల ఆరోగ్య బీమా పథకం కొనసాగిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్లు హర్షం వ్యక్తం చేసి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశాయి.

జర్నలిస్టుల సమస్యలపై అలుపెరుగని పోరాటం



# జర్నలిస్టు జగన్ దారుణ హత్య

చిత్తూరు జిల్లా వి.కోట మండలంలో ఏబీఎన్-ఆంధ్రజ్యోతి విలేకరి జగన్మోహన్ రెడ్డి దారుణ హత్యకు గురయ్యారు. ఏప్రిల్ 28న ఉదయం ఆయన వాకింగ్ చేస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. రోజువారీ వాకింగ్‌లో ఉన్న జగన్మోహన్‌రెడ్డి పై గుర్తుతెలియని దుండగులు వేట కొడవళ్లతో వెనుక నుంచి దాడి చేసి, విచక్షణారహితంగా నరికి హత్య చేశారు. ఈ హత్యకు ప్రధాన సూత్రధారిగా రౌడీషీటర్ తమీమ్‌ను పోలీసులు గుర్తించారు. నిందితుడు తమీమ్ గతంలో ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులలో నిందితుడు. ఎర్రచందనం స్మగ్లింగ్, మతకలహాలకు సంబంధించిన అంశాలపై జగన్మోహన్ రెడ్డి ఇటీవల చేసిన రిపోర్టింగ్, పోలీసులకు సమాచారం ఇవ్వడంపై కక్షగట్టి ఈ హత్య చేసినట్లు తెలుస్తోంది.కేసు నమోదు చేసి, నిందితులను పట్టుకోవడానికి ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్, నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్ట్సు సంఘాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి.

ఈ హత్య రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులలో తీవ్ర ఆగ్రహాన్ని కలిగించింది. నిందితులను వెంటనే అరెస్ట్ చేసి, జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని అన్ని జిల్లాల్లో ఎపిడబ్ల్యుజెఎఫ్, బిజెఎలు నిరసన ప్రదర్శన నిర్వహించాయి.

ఒక సామాన్య జర్నలిస్టును అతికిరాతంగా చంపడం దారుణమని చిత్తూరు జిల్లా పోలీసులు వెంటనే హత్య వెనుక దాగి ఉన్న కుట్రను బయటపెట్టాలని డిమాండ్ చేశాయి.

**హత్య వెనుక కారణాలు.....!!**

పక్కా ప్రణాళికతోనే జగన్మోహన్ రెడ్డిని హత్య చేసినట్టు పోలీసు వర్గాలు భావిస్తున్నాయి.హత్య వెనుక కారణాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి.తమ అక్రమ దందాలకు, సెటిల్ మెంట్లకు జగన్ అడ్డు వస్తున్నాడనే పక్కా ప్రణాళిక ప్రకారం అతన్ని కిరాతకంగా పొడిచి చంపారని పోలీసుల విచారణలో వెల్లడైంది. వి.కోటకు చెందిన ఆరీఫ్ గంజాయి సరఫరా చేస్తున్నాడని బెంగళూరు నగరంలోని శివాజీనగర్ పోలీసు స్టేషన్‌లో తమీమ్ ఫిర్యాదు చేశాడు. విచారణ జరిపిన పోలీసులు ఆరీఫ్ హస్తం లేదని తేల్చారు. తప్పుడు ఫిర్యాదు ఇవ్వడంతో పాటు గంజాయి సరఫరా చేస్తున్నడనే కారణంగా తమీమ్ పైనే పోలీసులు కేసు పెట్టారు.ఈ ఘటనలో తమీమ్ మూడు నెలలు జైలులో ఉన్నాడు. వి.కోటకు చెందిన బిఎస్పీనాయకుడు శ్రీనివాసులు బెయిల్ ఇప్పించి తమీమ్‌ను బయటకు తీసుకొచ్చారు. మిత్రుడైన ఆరిఫ్‌కు జగన్మోహన్ రెడ్డి అండగా నిలిచారు. అప్పటి నుంచే జగన్ పై తమీమ్ శత్రుత్వం పెంచుకున్నాడు.

వి.కొటలో 2024 సెప్టెంబర్‌లో మతఘర్షణలు జరిగాయి.ఇందులో కీలక పాత్ర పోషించిన తమీమ్‌పై పోలీసులు కేసులు పెట్టగా 31 రోజులు జైలులో ఉన్నాడు. అప్పుడు కూడా శ్రీనివాసులే జామీను ఇచ్చాడు. ఆ తర్వాత తమీమ్‌ను ముస్లిం మత పెద్దలు ఊరి బహిష్కరణ చేశారు. దీనికి జగనే కారణమని తమీమ్ భావించాడు.

పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన జాకీర్ గోపాల్ వద్ద శ్రీనివాసులు అయిదు వేల రూపాయలు తీసుకుని ఓ భూమి పట్టాను అమ్మాడు. విషయం తెలుసుకున్న జగన్ స్థానిక తాహసీల్దారుతో మాట్లాడి ఆ పట్టా నకిలీదని తేల్చారు. దీంతో జాకీర్, గోపాల్‌లు శ్రీనివాసుల వద్దకు వెళ్ళి తామిచ్చిన డబ్బులను వెనక్కి తీసుకున్నారు. దీనికి తోడు వ్యక్తిగత వివాదాలు ఉండడంతో జగన్‌పై శ్రీనివాసులు కక్ష పెంచుకున్నాడు.

ఓ కేసు విషయమై జగన్ ఏప్రిల్ 24న చిత్తూరు కోర్టుకు హాజరయ్యారు.తన మేనత్త కొడుకు సుభాన్‌తో అక్కడికి వచ్చిన తమీమ్ సుమారు గంటసేపు జగన్‌తో మాట్లాడినట్టు

ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. తర్వాత నాలుగు రోజులకే ఈ హత్య జరిగింది.

బిఎస్పీ నాయకుడు శ్రీనివాసులు వారంరోజులుగా తమీమ్‌తో పాటు వి.కోటలో తిరిగాడు. ఏప్రిల్ 23 తర్వాత నుంచి సాధారణ కాల్స్‌కు బదులు వాట్సప్ కాల్స్ మాత్రమే మాట్లాడుతున్నట్టు పోలీసులు గుర్తించారు. ఏప్రిల్ 28 నుంచి శ్రీనివాసులు పోలీసుల అదుపులో ఉండగా తమీమ్, అతడి బావమరిది సుభాన్ బెంగళూరు పోలీసుల ఎదుట లొంగిపోయారు.



కలం విరిగింది... కానీ గళం ఆగదు!

సమాజంలోని అన్యాయాలను ఎండగట్టే అక్షర సైనికుడిపై అమానుషంగా దాడి చేసి, ప్రాణాలు తీయడం కేవలం ఒక వ్యక్తిపై జరిగిన హత్య కాదు, ప్రజాస్వామ్య మూలస్థంభంపై జరిగిన దాడి. జగన్మోహన్ రెడ్డిలాంటి నిజాయితీ గల జర్నలిస్టును కోల్పోవడం పూడ్చలేని లోటు. వార్త రాస్తే వేటాడతారా? నిజం చెబితే నిలువునా బలి చేస్తారా? కలం పట్టిన చేతిని నరికేయడం పిరికిపందల చర్యే తప్ప మరేమీ కాదు.

వి.కోట ఘటనపై పాత్రికేయ లోకం రగిలిపోతోంది. రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు ధరించిన నల్ల బ్యాడ్జీలు కేవలం నిరసన చిహ్నాలు కావు, అవి వ్యవస్థలో పేరుకుపోయిన అసహనంపై ఎక్కుపెట్టిన బాణాలు. గాయపడిన సుబ్రమణ్యం రెడ్డి రక్తం, ప్రాణాలు కోల్పోయిన జగన్మోహన్ రెడ్డి త్యాగం వృధా పోకూడదు. ఈ రక్తాక్షర సాక్షిగా ఒక్కటే చెబుతున్నాం.. చంపితే మనిషి చనిపోతాడేమో కానీ, అతను రాసిన అక్షరం ఎప్పటికీ సజీవంగానే ఉంటుంది.



# పత్రికలపై దాడులు సమంజసం కాదు

సమాజంలో ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ నిత్యం సమాజం కోసం పనిచేసే పత్రికలపై దాడులను ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ తీవ్రంగా ఖండిస్తోంది. తిరుపతిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి జి ఆంజనేయులు స్వేచ్ఛాయుత వాతావరణంలో పని చేయాల్సిన జర్నలిస్టులు నేడు రాజకీయ పార్టీలు, యాజమాన్యాల మధ్య కలిగి పోతున్నారని అన్నారు. ఈ సంఘర్షణలో అంతిమంగా నష్టపోయేది మాత్రం సామాన్య జర్నలిస్టులేనని అన్నారు. అందుకు నిదర్శనం ఆంధ్రజ్యోతి దినపత్రికపై జరిగిన దాడిని ఉదహరించారు. ప్రచురితమైన వార్తలకు సంబంధించి గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే విలేకరులు క్షేత్రస్థాయిలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పత్రికలో కానీ ప్రసారమాధ్యమాల్లో గాని ఏవైనా అభ్యంతరకర అంశాలు ప్రసారమైతే వాటిపై వివరణ కోరవచ్చు, ఖండన ఇవ్వవచ్చు, లేదా తీవ్రమైన అంశంగా పరిగణించినట్లయితే కోర్టుల ద్వారా కేసులు వేయడానికి అవకాశం ఉందని, అటువంటి మార్గాలను విడనాడి జర్నలిస్టులను భయభ్రాంతం చేసేందుకు దాడులకు పాల్పడడం, కార్యాలయాలపై దాడులు చేసి విధ్వంసం సృష్టించే ప్రయత్నం చేయడం ఎంత మాత్రం సరికాదని ఆయన అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సీనియర్ జర్నలిస్టులు ఆలూరి గిరిధర్, మోహన్ రావు, ఏపీడబ్ల్యుజెఎఫ్ తిరుపతి జిల్లా అధ్యక్షులు చెంగల్ రాయలు, కార్యదర్శి వలిగలం గోపి, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు మల్లెల వాణి, కిరణ్ దాచేపల్లి పాల్గొన్నారు.

# సోషల్ మీడియా దుర్వినియోగంపై ఉక్కు పాదం

సోషల్ మీడియా వేదికలను దుర్వినియోగం చేసే వారిపై పోలీసులు ఉక్కు పాదం మోపుతున్నారు. వాట్సాప్, ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్ తదితర సోషల్ మీడియా వేదికల్లో కొందరు వ్యక్తులు, వ్యవస్థీకృత బృందాల అవమానకర వ్యాఖ్యలు, రాజకీయ ప్రేరిత పోస్టులు, సామాజిక ఉద్రిక్తతలు రేకెత్తించే సందేశాలు, తప్పుడు ప్రచార వదంతులను వ్యాప్తి చేసే వారిని పోలీసులు గుర్తించి వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. ఇటువంటి పోస్టులను ప్రజల శాంతి భద్రతలకు భంగం కలిగించే తీవ్రమైన నేరంగా భావిస్తున్నారు. ఇటువంటి పోస్టులను ఏమాత్రం ఉపేక్షించకూడదనే విధానాన్ని కఠినంగా అమలు చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా రెండేళ్లలో 1549 కేసులు నమోదు చేసి 134 మందికి పైగా అరెస్టులు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ పోలీస్ డైరెక్టర్ జనరల్ హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. ఇవి కాకుండా దాదాపు 4529 చట్ట విరుద్ధ పోస్టులను తొలగించినట్లు ఆయన తెలియజేశారు. ఈ కేసులపై ఆయన ప్రత్యేకంగా సమీక్షించారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ 2000, భారతీయ న్యాయ సంహిత చట్టం 2023 కింద చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో సెక్షన్ 111 వంటి కఠిన నిబంధనలు కూడా వర్తింప చేస్తున్నారు. ఇదే విధంగా భారతీయ నాగరికత సురక్ష సంహిత 2023 నిబంధనల ప్రకారం నిందితులు ఉద్దేశపూర్వకంగా విచారణకు హాజరుకాకుండా తప్పించుకునే పరిస్థితుల్లో కూడా పై సెక్షన్ల ప్రకారం చర్యలు తీసుకుంటున్నారు. కోర్టు సమన్లు, వారెంట్లు జారీ అయినప్పటికీ హాజరు కాకపోతే వారి గైర్హాజరుతోనే విచారణ కొనసాగించి తీర్పు ఇవ్వబడుతుంది. దీని ద్వారా న్యాయ ప్రక్రియ ఆలస్యం కాకుండా కొనసాగిస్తూ నేరస్తులు శిక్ష నుంచి తప్పించుకోకుండా నిరోధించాలని, ఈ ప్రయత్నం తరచూ ఈ తరహా నేరాలకు పాల్పడే వ్యక్తులు, వ్యవస్థీకృత గ్రూపులపై మరింత కఠిన చర్యలు తీసుకుంటామని అవసరమైతే సంఘటిత నేరాలకు సంబంధించిన

చట్టాలను కూడా ప్రయోగిస్తామని డిజిపి స్పష్టం చేశారు. నకిలీ అకౌంట్లు, గోప్యత పేరుతో తప్పించుకునే ప్రయత్నాలు చేసినా అధునాతన సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో నిందితులను గుర్తించి అరెస్టు చేస్తామని డిజిపి హెచ్చరించారు. అధునాతన సాంకేతికతతో ప్రత్యేక సోషల్ మీడియా పర్యవేక్షణ విభాగాన్ని ఏర్పాటు చేసి ఏఐ విశ్లేషణ, రియల్ టైం పర్యవేక్షణ, డిజిటల్ ఫోరెన్సిక్ పద్ధతులలో నేరాలను వేగంగా గుర్తిస్తున్నట్లు తెలియజేశారు. ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఏదైనా సమాచారాన్ని సోషల్ మీడియా వేదికలలో పంచుకునే ముందు ధ్రువీకరించుకోవాలని, నిర్ధారణ లేని సమాచారాన్ని పంచుకోవద్దని విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని డిజిపి హెచ్చరించారు.

# ప్రముఖ జర్నలిస్టు రానా ఆయూబ్‌పై ఎఫ్ ఐ ఆర్



ప్రముఖ జర్నలిస్టు రానా ఆయుబ్ సోషల్ మీడియాలో చేసిన ట్వీట్లు అత్యంత అవమానకరం, రెచ్చగొట్టేవి, మతతత్వంతో కూడుకున్నవి అని ఢిల్లీ హైకోర్టు అభివర్ణించింది. ఈ ట్వీట్లు ఆధారంగా ఆయూబ్‌పై ఎఫ్ ఐ ఆర్ నమోదు విషయంలో కేంద్రం ఢిల్లీ పోలీసులు, సోషల్ మీడియా ప్లాట్ఫామ్స్, ఎక్స్ సమన్వయంతో పనిచేయాలని 24 గంటల్లో అవసరమైన చర్యలు తీసుకోవాలని కూడా కోర్టు స్పష్టం చేసింది. ఆయూబ్ గతంలో చేసిన ట్వీట్లకు వ్యతిరేకంగా న్యాయవాది అమిత్ సచ్‌దేవా దాఖలు చేసిన పిటీషన్‌ను జస్టిస్ పురుషేంద్ర కుమార్ కౌరవ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. అయూబ్ చేసిన ట్వీట్లు తీవ్రమైనవిగా పేర్కొంటూ అయూబ్‌కు, కేంద్రానికి, ఎక్స్‌కు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో ఢిల్లీ పోలీసులను కూడా హైకోర్టు ఒక పక్షంగా చేర్చింది. తదుపరి విచారణ మే10కి వాయిదా వేసింది. కాగా ఆయూబ్ చేసిన ట్వీట్ తక్షణం తొలగించే విధంగా ఆదేశాలు ఇవ్వాలని కూడా పిటీషనర్ కోరారు. ఆమె ట్వీట్‌లో నిరంతరంగా బహిరంగంగా అందుబాటులో ఉండడం వల్ల తమ మనోభావాలకు నిరంతరంగా, ప్రత్యక్షంగా హాని కలిగిస్తుందని రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 స్వేచ్ఛగా జీవించే హక్కు, ఆర్టికల్ 25 మత స్వేచ్ఛ ద్వారా కల్పించిన ప్రాథమిక హక్కులకు ఉల్లంఘన కలుగుతుందని పిటిషనర్ చెప్పుకొచ్చారు. అయితే రానాపై కావాలనే సంఘ్ పరివార్ వ్యక్తులు పిటిషన్లు వేస్తున్నారని, జర్నలిస్టులకు తమ భావాలను వ్యక్తపరిచే స్వేచ్ఛ లేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

# అమెరికన్ జర్నలిస్ట్ కిడ్నాప్, విడుదల

ఇరాక్‌లో అమెరికాకు చెందిన మహిళా జర్నలిస్టు కిటిల్సన్ కిడ్నాప్‌కు గురైన అనంతరం విడుదలయ్యారు. ఈ విషయాన్ని అమెరికా విదేశాంగ మంత్రి మార్కోరుబయో అధికారికంగా ధ్రువీకరించారు. ఆమె విడుదలతో తామంతా ఊపిరి పీల్చుకున్నామని ఇరాక్ నుంచి ఆమె సురక్షితంగా బయటకు వచ్చేందుకు పూర్తి సహాయం అందిస్తామని ఆయన తెలియజేశారు. ఇరాక్ లోని బాగ్దాద్‌లో ఓ అమెరికన్ జర్నలిస్టు మార్చి 31న బాగ్దాద్‌లోని ఒక వీధిలో కిడ్నాప్‌కు గురయ్యారు. ఆమెను కిడ్నాప్ చేసిన కతైబ్ హిజ్బుల్లా మిలీషియా గ్రూపు విడుదలైన వెంటనే ఆమె దేశం విడిచి వెళ్ళిపోవాలనే షరతు విధించింది. ఆమెను అప్పగించుకుపోయిన వారి కోసం ఇరాక్ భద్రతా దళాలు గాలిస్తున్నాయని అధికారులు తెలిపారు. ఇరాక్ ప్రధాని మహమ్మద్ దే అల్ సుదాని దేశభక్తి వైఖరిని ప్రశంసిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నామని భవిష్యత్తులో ఇలాంటి చొరవ మళ్ళీ ఉండదని కజ్బుల్లా స్పష్టం చేసింది.

తొలుత ఈ అపహరణకు సంబంధించిన సమాచారాన్ని ఒక అమెరికా అధికారి తెలియజేశారు. ఇరాన్ మద్దతు ఉన్న ఇరాకీ మిలీషియా కతైబ్ హిజ్బుల్లానే కారణమని ఆ అధికారి ఆరోపించారు. విదేశీ జర్నలిస్టు అపహరణకు గురైనట్టు ఇరాక్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ ధ్రువీకరించింది. ఈ కేసు గురించి బహిరంగంగా మాట్లాడే అధికారం లేనందున తమ పేర్లు వెల్లడించొద్దని షరతుపై ఇద్దరు ఇరాక్ భద్రత అధికారులు అపహరణకు గురైన జర్నలిస్టు ఒక మహిళని, అమెరికా పౌరురాలని తెలిపారు. ఈ అపహరణలో రెండు కార్లు పాల్గొన్నాయి. వాటిలో ఒకటి బాగ్దాద్‌కు నైరుతి దిశలో ఉన్న బాబిల్ ప్రాఫిట్స్ లోని అల్ హస్వ పట్టణం సమీపంలో వెంబడిస్తుండగా ప్రమాదానికి గురైందని చెప్పారు. ఆ తరువాత ఆ జర్నలిస్టును రెండవ కారులోకి మార్చి అక్కడి నుంచి పారిపోయేలా చేశారని కిడ్నాపర్ల జాడను తెలుసుకోవడానికి భద్రతా దళాలు ఒక ఆపరేషన్ ప్రారంభించారని తెలియజేశారు. కిడ్నాపర్లు పారిపోవడానికి బోల్తాపడిన వారికి చెందిన వాహనాన్ని అడ్డగించారని అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ ఘటనలో ఒక అనుమానితుడిని అరెస్టు చేశారని కిడ్నాప్‌లో ఉపయోగించిన వాహనాల్లో ఒక దాన్ని స్వాధీనం చేసుకున్నారని, అయితే ఇతరులు ఇంకా పరారీలో ఉన్నారని తెలిపారు. సెంట్రల్ బాగ్దాద్‌లోని సాధున్ వీధిలో జర్నలిస్టును అపహరించారని అన్ని చెక్ పాయింట్లకు హెచ్చరిక జారీ చేయడంతో కిడ్నాపర్లు బాబిన్ ప్రావిన్స్ వైపు వెళుతుండగా వారిని వెంబడించినట్లు ఇద్దరు ఇరాక్ భద్రతాధికారులు తెలిపారు. పశ్చిమాసియా వార్తలను అందించే ప్రాంతీయ వార్తా సంస్థ అల్ మానిటర్ ఈ సంఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఆ జర్నలిస్టు తమ పత్రికకు పనిచేస్తున్న కిటిల్సన్‌గా గుర్తించింది.

---



Oh, you are a journalist. Which party, sir?

# జర్నలిస్టు పూడి శ్రీహరి అరెస్టు

సుదీర్ఘకాలం జర్నలిస్టుగా పనిచేసిన పూడి శ్రీహరిని పోలీసులు అరెస్టు చేశారు. సోషల్ మీడియా పోస్టింగులకు సంబంధించి ఆయనను బాధ్యుని చేసి ఈ అరెస్టుకు పాల్పడినట్టు తెలుస్తోంది. శ్రీహరి జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆయన వద్ద సిపిఆర్ఓగా పనిచేశారు. అంతకు ముందు ఆయన జర్నలిస్టు. సోషల్ మీడియా పోస్టింగ్స్‌లో సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో వచ్చిన వార్తలకు సంబంధించి పూడి శ్రీహరిని బాధ్యుని చేస్తూ ఈ అరెస్టులు చేసినట్టు పోలీసు వర్గాలు తెలియజేశాయి. పూడి శ్రీహరి అరెస్ట్ అక్రమమని, జర్నలిస్టును చట్ట విరుద్ధంగా అరెస్టు చేయడం అక్రమం అని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఖండించింది. నోటీసులు ఇవ్వకుండా ఎలా అదుపులోకి తీసుకుంటారని ఈ అరెస్టును జర్నలిస్టులు అందరూ ఖండిస్తున్నారని పూడి శ్రీహరిని వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ప్రభుత్వాన్ని కోరింది. సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో వచ్చిన వాటికి పూడి శ్రీహరిని బాధ్యుని చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించింది.

# జర్నలిస్టుతో కాళ్ళు మొక్కించుకున్న మహిళ

మీడియాను భయపెట్టే చర్య అనంతపురం జిల్లాలో చోటు చేసుకుంది. ఒక విద్యా సంస్థను నిర్వహించే మహిళ ఈ చర్యకు పాల్పడింది. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన హనీ ట్రాప్ కేసులోని నిందితులతో శ్రీ గీతం విద్యాసంస్థ నిర్వహిస్తున్న మనీషా నాయర్‌కు సంబంధాలు ఉన్నాయని వచ్చిన వార్తపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఈ చర్యకు పాల్పడ్డారు. అనంతపురం పట్టణంలో మనం దినపత్రికకు విలేకరిగా పనిచేస్తున్న లక్ష్మీనారాయణ రాసిన వార్తపై మండిపడ్డ మనీషా నాయర్ ఆయన ఇంటికి వెళ్లి భార్యాబిడ్డల ముందే తీవ్రంగా దూషించటంతో పాటు తప్పు చేసినట్లు కాళు పట్టుకొని క్షమాపణ చెప్పించుకున్నారు. ఆమె తన అనుచరులతో లక్ష్మీనారాయణ ఇంటికి వెళ్లి వారిని భయభ్రాంతులను చేశారు. విద్యా సంస్థలు నిర్వహించే వ్యక్తులు ఈ విధంగా వ్యవహరించటం మీడియా వర్గాల్లో ఆగ్రహం తెప్పించింది. ఆమె అంతటితో ఆగకుండా అనంతపురంలోని ప్రెస్ క్లబ్‌కు వెళ్లి మొత్తం మీడియాను భయభ్రాంతులను చేసేందుకు సాగించిన ప్రయత్నంపై జిల్లాలోని మీడియా వర్గాలు భగ్గుమన్నాయి. తాను ఏం చేసినా మీడియా ఏమి చేయలేదనే ధోరణితో వ్యవహరిస్తున్న ఆమె వైఖరికి నిరసనగా జర్నలిస్టులు అక్కడికక్కడే ధర్నా చేశారు. లక్ష్మీనారాయణపై వ్యవహరించిన తీరుకు



నిరసనగా మనీషా నాయర్ ను వెంటనే అరెస్టు చేయాలని పోలీసులను డిమాండ్ చేశారు. ఈ సంఘటన సమాచారం తెలుసుకున్న వెంటనే రాష్ట్రంలోని వివిధ కేంద్రాలలో జర్నలిస్టులు పెద్ద ఎత్తున నిరసనలకు దిగారు. వివిధ జిల్లా కేంద్రాల్లో, నగరాల్లో, పట్టణాల్లో, మండల కేంద్రాల్లో కూడా ఈ సంఘటనపై తీవ్ర నిరసన వ్యక్తం అయింది.

### భార్యా పిల్లలు ఎదుటే అవమానించారు

తాను రాసిన వార్త బాధ కలిగిస్తే వివిధ పద్ధతులను అనుసరించి చర్య తీసుకునే వీలుంది. ఖండన ఇవ్వవచ్చు, వివరణ ఇవ్వవచ్చు. అంతకంటే తీవ్రంగా భావించిన సందర్భంలో పరువునష్టం కేసు దాఖలు చేయవచ్చు. అందుకు భిన్నంగా భయపెట్టేందుకు అనుచరగణంతో ఇంటికివచ్చి తన భార్య పిల్లల ఎదుట అవమానించడం ఆవేదన కలిగించిందని విలేకరి లక్ష్మీనారాయణ తెలియజేశారు. "నన్ను కాళు పట్టించారు, కుటుంబాన్ని చంపేస్తామని బెదిరిస్తున్నారు. రాత్రిపూట భయంతో జీవిస్తున్నాం" అంటూ డిఎస్పీ కార్యాలయం ముందు రోడ్డుపై పడుకుని నిరసన తెలియజేశారు. "నాకు మాత్రమే కాదు, నా భార్య పిల్లలకు కూడా ప్రాణహాని ఉంది, మాకు రక్షణ కల్పించాలి, న్యాయం జరిగేంతవరకు పోరాటం ఆపను" అని ఆయన స్పష్టం చేశారు. ఈ ఘటనకు మద్దతుగా అనంతపురంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్, ఆంధ్ర ప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్‌తో పాటు వివిధ సంఘాల నాయకులు, విలేకరులు డిఎస్పీ కార్యాలయం వద్దకు చేరుకొని తమ నిరసన తెలియజేశారు. ఒక జర్నలిస్టుపై దాడి అంటే ప్రతి కలం పైన దాడి అంటూ నినాదాలు చేశారు. ఈ సంఘటనపై డిఎస్పీ శ్రీనివాసులు స్పందిస్తూ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అవసరమైతే తగిన సెక్షన్లుతో కేసు నమోదు చేసి పూర్తి న్యాయం చేస్తాం. సమగ్ర విచారణ జరుగుతుంది అని భరోసా ఇచ్చారు. ఈ ఘటన సామాజిక వర్గాల్లో తీవ్ర





ఆందోళన రేకెత్తిస్తోంది. వార్త రాసినందుకు ఇంటికి వెళ్లి బెదిరింపులు చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్ల ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో వెంటనే స్పందించి నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సంఘటనకు బాధ్యురాలైన మనీషా నాయర్‌పై వెంటనే చర్య తీసుకోవాలని కోరుతూ అధికారులకు విజ్ఞాపులు అందజేశారు. జర్నలిస్టులపై జరుగుతున్న ఇటువంటి దాడులను అరికట్టేందుకు వీలుగా ప్రభుత్వం జర్నలిస్టులపై దాడుల నిరోధ కమిటీలను ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర స్థాయిలో హూంమంత్రి నేతృత్వంలో ఉండే హైపవర్ కమిటీని తక్షణమే నియమిస్తే ఇటువంటి సంఘటనలపై స్పందించి తగిన చర్యలు తీసుకునేందుకు వీలుంటుందని ఫెడరేషన్ అభిప్రాయపడుతోంది. జర్నలిస్టుల భద్రత, భావ ప్రకటన స్వేచ్ఛపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు. కలాన్ని భయపెట్టొచ్చు కానీ నిజాన్ని కాదు. అనంతపురం ఘటన ఇప్పుడు అదే ప్రశ్నను సమాజం ముందు ఉంచుతోంది.







# జగన్ హత్యతో వెల్లువెత్తిన నిరసన



చిత్తూరు జిల్లా కోట మండలం ఆంధ్రజ్యోతి విలేకరి జగన్మోహన్ రెడ్డిని అరాచక శక్తులు పట్టపగలే దారుణంగా హత్య చేయడాన్ని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్, ఆంధ్ర ప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్స అసోసియేషన్లు తీవ్రంగా ఖండించాయి. ఈ హత్యకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున జర్నలిస్టులు తమ ఆగ్రహాన్ని వెలిబుచ్చారు. జిల్లా కేంద్రాలు, నగరాలు, పట్టణ కేంద్రాలతో పాటు మండల కేంద్రాల్లో జర్నలిస్టు జగన్ హత్యను ఖండిస్తూ ధర్నాలు, ప్రదర్శనలు, వినతిపత్రాలు సమర్పించారు. కొన్నిచోట్ల కొవ్వొత్తుల ప్రదర్శనలు నిర్వహించి జగన్‌కు నివాళులు అర్పించారు.

పుంగనూరు నియోజకవర్గ కేంద్రంలో ఏపీడబ్ల్యూజేఎఫ్, ఏపీబీజేఏ ఆధ్వర్యంలో భారీ ధర్నా, రాస్తారోకో నిర్వహించారు.

నిజం రాసినందుకు నిలువునా నరికేశారు!

ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ రాయలసీమ జిల్లాల ఇన్చార్జ్ కవరకుంట్ల జయరాజ్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి కేవలం తన వృత్తి ధర్మాన్ని నిర్వహించారని, ఎర్రచందనం స్మగ్లర్ల ఆగడాలను, భూకబ్జాదారుల అక్రమాలను ఎండగడుతూ వార్తలు రాసినందుకే అతన్ని టార్గెట్ చేసి చంపడం హేయమైన చర్య అని మండిపడ్డారు. ''ప్రశ్నించే గొంతును నొక్కేయాలని చూస్తే అది అక్షరాయుధమై ఎదురుదాడి చేస్తుంది. జగన్మోహన్ రెడ్డి హత్య కేవలం ఒక వ్యక్తిపై జరిగిన దాడి కాదు, ప్రజాస్వామ్య వ్యవస్థపై జరిగిన దాడి,'' అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు తక్షణమే 'జర్నలిస్ట్ ప్రొటెక్షన్ యాక్ట్' (ప్రత్యేక రక్షణ చట్టం) రూపొందించి అమలు చేయాలి అని చేశారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన జగన్మోహన్ రెడ్డి కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలన్నారు. మీడియా పత్రికా స్వేచ్ఛను కాపాడేందుకు, జర్నలిస్టుల భద్రతను పర్యవేక్షించేందుకు రాష్ట్రంలో వెంటనే 'మీడియా కమిషన్' ఏర్పాటు చేయాలి. ఈ హత్య వెనుక ఉన్న అసలు సూత్రధారులను, పాత్రధారులను గుర్తించి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కఠిన శిక్షలు పడేలా చూడాలని కోరారు.

హోరెత్తిన పుంగనూరు – భారీ ర్యాలీ

స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రారంభమైన నిరసన ర్యాలీ ఎంపిటి రోడ్డు మీదుగా పోలీస్ స్టేషన్ వరకు కొనసాగింది. ఈ నిరసనలో ఏఐఎస్ఎఫ్, సీపీఐ, మాల మహానాడు వంటి వివిధ ప్రజా సంఘాలు పాల్గొని జర్నలిస్టుల పోరాటానికి సంఘీభావం తెలిపాయి. అనంతరం పుంగనూరు పట్టణ సీఐ సుబ్బరాయుడుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు, అన్నమయ్య జిల్లాల కార్యదర్శులు షేక్ సలీం భాషా, పి.ఎ. హిదాయతుల్లా (అప్పా), జిల్లా సంయుక్త కార్యదర్శి ఎల్. నాగరాజా, వర్కింగ్ ప్రెసిడెంట్ గిరిశేఖర్, పుంగనూరు నియోజకవర్గ నేతలు ఎండి సైఫుల్లా, డాక్టర్ తల్లా శ్రీనివాస్, జి.ఆర్. మురళి, ప్రజాశక్తి మురళి, జగదీష్ కుమార్, శంకర్ రాజు, సురేష్, వాసు, లోకేష్, నజీర్ సాహెబ్, పురుషోత్తం, కార్తీక్, సతీష్, జావిద్, రెడ్డి, మంజునాథ్, రియాజ్, దేవేంద్ర మరియు



అధిక సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

చిత్తూరులో

చిత్తూరు జిల్లా వి. కోట లో ఈరోజు ఉదయం ఆంధ్రజ్యోతి విలేఖరి జగన్మోహన్ రెడ్డి హత్య అత్యంత అమానుషం దారుణం బాధాకరం అని ఫెడరేషన్ చిత్తూరు జిల్లా అధ్యక్షులు ప్రకాష్ రెడ్డి, ఎపిబిజెఎ చిత్తూరు జిల్లా అధ్యక్షులు చల్లా జయచంద్ర పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని మహాత్మ గాంధీ విగ్రహం వద్ద రెండు సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రకాష్, జయచంద్ర మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన పత్రికా రంగంపై ఇలాంటి దాడులు క్షమించరానివన్నారు. దుండగులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి ప్రభుత్వం విలేకరులకు పూర్తి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు, హత్యకు గురైన జర్నలిస్ట్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ చిత్తూరు నియోజకవర్గం అధ్యక్ష కార్యదర్శులు కేశవులు, బాలు తదితరులు పాల్గొన్నారు.






రంపచోడవరంలో

పోలవరం జిల్లా : చిత్తూరు జిల్లా వి. కోటలో ఎబిఎన్ – ఆంధ్రజ్యోతి సీనియర్ జర్నలిస్ట్ జగన్మోహన్ హత్యకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరుతూ రంపచోడవరం పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ రమేష్‌కు వినతిపత్రం అందించటం జరిగింది. ఫెడరేషన్ జిల్లా నాయకులు పల్లా. రాంబాబు, జి. వి. నారాయణరావు, మాధవ వరప్రసాద్, సూరిబాబులతోపాటు మరి కొందరు పాల్గొన్నారు.

విజయవాడ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన

చిత్తూరు జిల్లా వి. కోట ఎబిఎన్ ఆంధ్రజ్యోతి విలేకరి జగన్మోహన్ రెడ్డి హత్యను, వి.కోట ప్రజాశక్తి విలేకరి సుబ్రహ్మణ్యంపై దాడిని ఖండిస్తూ విజయవాడ బందరు రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యూజెఎఫ్), ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (ఎపిబిజెఎ) ఆధ్వర్యంలో జర్నలిస్టులు నిరసన తెలియజేశారు. అనంతరం బందరు రోడ్డులో కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్ళి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారిలో ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు షేక్ ఖాజావలి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె. కలిమిశ్రీ, ఎం. బి. నాథన్, జిల్లా నాయకులు జె. వి. శ్రీనివాసరావు, కిరణ్, వి. హెచ్. రాజు, ఎన్. నరేంద్ర కుమార్, డి. వి. ఆనంద్, జర్నలిస్టులు యు. ఉదయ భాస్కర్ తదితరులు ఉన్నారు. ఇబ్రహీంపట్నంలో జర్నలిస్టులు ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రదర్శన చేసి స్థానిక సిఐకి వినతిపత్రం సమర్పించారు.

చింతూరులో కొవ్వొత్తుల నిరసన

చిత్తూరు జిల్లాలో ఆంధ్రజ్యోతి విలేకరిని దారుణంగా హతమార్చిన ఘటనపై చింతూరు ప్రాంత జర్నలిస్టులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ చింతూరు డివిజన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 28న కొవ్వొత్తులు వెలిగించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు, మన్యం రిపోర్టర్ సత్యా యాదవ్ మాట్లాడుతూ జర్నలిస్టుపై జరిగిన హత్య ప్రజాస్వామ్యానికి మచ్చ తెచ్చే ఘటన అని తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హత్యకు






గురయిన జర్నలిస్టు కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఎక్స్‌గ్రేషియా ప్రకటించి అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ ఘటనకు బాధ్యులైన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. జర్నలిస్టులపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవాలని నాయకులు అభిప్రాయపడ్డారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చే పాత్రికేయుల భద్రతకు ప్రభుత్వం హామీ ఇవ్వాలని వారు అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ చింతూరు డివిజన్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు ఎస్కే ఇబ్రహీం, డివిజన్ నాయకులు, పలువురు జర్నలిస్టులు పాల్గొని మృత విలేకరికి నివాళు లర్పించారు.

గుంటూరులో జర్నలిస్టుల నిరసన ప్రదర్శన చిత్తూరు జిల్లా వి.కోటలో ఆంధ్రజ్యోతి విలేఖరి జగన్మోహన్ రెడ్డి ని హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ (ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్) వివిధ జర్నలిస్ట్ సంఘాల ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా జర్నలిస్టులు సంయుక్తంగా నిరసన ర్యాలీ నిర్వహించి జిల్లా ఎస్పీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు పట్నాల సాయికుమార్, ఏపీబీజేఏ జిల్లా అధ్యక్షులు సువర్ణబాబు మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులు తీవ్రంగా ఖండించాల్సిన విషయమని తెలిపారు. వార్తలు రాస్తున్నందుకు జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకోవడం ప్రజాస్వామ్యానికి



ప్రమాదకరమని అన్నారు. హత్యపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులను వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి మహేష్ వరదల, వేముల రాజేష్,రవి కుమార్,ప్రసాద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో

చిత్తూరు జిల్లా ఆంధ్రజ్యోతి రిపోర్టర్. జగన్మోహన్ రెడ్డిని చంపిన వారిని కఠినంగా శిక్షించాలని శ్రీకాళహస్తి పాత్రికేయులు డిమాండ్ చేశారు. స్థానికంగా తమ నిరసనను వ్యక్తం చేశారు. చిత్తూరు జిల్లా ఎస్పీ, చిత్తూరు జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి ఆంధ్రజ్యోతి విలేఖరినీ చంపిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు.

అనంతపురంలో

వీకోట ఆంధ్ర జ్యోతి విలేఖరి జగన్మోహన్ రెడ్డిని దారుణంగా హత్య చేసిన హంతకులను శిక్షించాలని అనంతపురం జిల్లా కలెక్టర్ ఆనంద్‌కు ఫెడరేషన్ ప్రతినిధివర్గం ప్రదర్శనగా వెళ్లి వినతి పత్రం అందజేశారు.

రావులపాలెంలో

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రావులపాలెం సీఐ శేఖర్ బాబు వినతిపత్రం అందజేయడం జరిగింది. ఆంధ్రజ్యోతి విలేఖరి హత్యకు పాల్పడిన దుండగులను తక్షణమే అరెస్టు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫెడరేషన్ నాయకులు బంగారురాజు, అంబేద్కర్ కోనసీమ, జిల్లా కార్యదర్శి వాకాడ బాబులు, కొత్తపేట నియోజకవర్గ కార్యదర్శి పల్నాటి ప్రసాద్ కుమార్, శంకరం, దారపు రెడ్డి సత్యనారాయణ, వేణు, మూర్తి, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.





# విశాఖలో కదం తొక్కిన జర్నలిస్టులు

## దాడులను నియంత్రించేందుకు కమిటీలు ఏర్పాటు చేయండి

చిత్తూరు జిల్లాలో జర్నలిస్టు జగన్మోహన్ రెడ్డి హత్య తీవ్ర ఆందోళన కలిగించే అంశం అని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్షులు వి నారాయణలు పేర్కొన్నారు. ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపీ బ్రాడ్ కాస్ట్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ల సభ్యులు సంయుక్తంగా విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద మే 2న శాంతియుత ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ జర్నలిస్టులపై హత్య రాజకీయాలను మానుకోవాలని డిమాండ్ చేశారు. పాత్రికేయులు ప్రచురించే వార్తలపై అభ్యంతరాలు ఉంటే వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చునని, యాజమాన్యాలకు ఫిర్యాదు చేయవచ్చునని అలా కాకుండా హత్యలకు తెగబడటం దుర్మార్గమన్నారు. ఒక జర్నలిస్టును కిరాతకులు హత్య చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారన్నారు. అనంతపురంలో మనం విలేకరి లక్ష్మీనారాయణ ఇంటికి వెళ్లి ఒక విద్యాసంస్థ కరస్పాండెంట్ వ్యవహరించిన తీరును తప్పుబట్టారు. ఇటీవల సాలూరులో ఇద్దరు మీడియా ప్రతినిధులపై దాడులు కూడా సరికాదన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడులు నియంత్రణకు ప్రభుత్వం తక్షణమే జర్నలిస్టులపై దాడుల నివారణ కమిటీలు పునరుద్ధరించాలని కోరారు. ఈ కమిటీల ఏర్పాటు వల్ల జిల్లాలో దాడులకు పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవడానికి వెసులుబాటు కలుగుతుందన్నారు. సమాజాభివృద్ధి కోసం పాటుపడుతున్న జర్నలిస్టులపై హత్యలు, దాడులు సరికాదన్నారు. కూటమి ప్రభుత్వం హత్యలు, దాడులకు పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు చేపట్టాలని వీరు డిమాండ్ చేశారు. అలాగే జర్నలిస్టుల సమస్యలు పరిష్కారానికి మరింతగా కృషి చేయాలన్నారు.

ప్రభుత్వానికి నివేదిస్తా జెసి విద్యాధరి

శాంతియుత ప్రదర్శన అనంతరం జర్నలిస్టులు జిల్లా జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ళ విద్యా దరికి రెండు వినతి పత్రాలు అందజేశారు. హత్యలు, దాడులు చేసే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని తక్షణమే జర్నలిస్టులపై దాడుల నివారణ కమిటీలు పునరుద్ధరించాలని వినతి పత్రంలో కోరడం జరిగింది. అయితే జేసీ విద్యాధరి జర్నలిస్టుల వినతిపత్రాలపై సానుకూలంగా స్పందించినట్లు గంట్ల శ్రీనుబాబు చెప్పారు. ప్రత్యేక ఫైల్ రూపొందించి జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి వినతి పత్రాలు పంపించినట్లు జెసి చెప్పడం జరిగిందన్నారు. అలాగే జర్నలిస్టుల పెండింగ్ సమస్యలు అందులో పొందుపరిచామన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ విశాఖ జిల్లా కార్యదర్శి జి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు బి శివప్రసాద్, కృష్ణమూర్తి నాయుడు, కిశోర్, కర్రా సీతారామ్, బ్రాడ్ కాస్ట్ విశాఖ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఇరోతి ఈశ్వరరావు, కింతాడ మదన్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ విశాఖ జిల్లా అధ్యక్షులు జగన్మోహన్, కోశాధికారి కె వి శర్మ, బొబ్బర ప్రసాద్, రాజశేఖర్, సీనియర్ పాత్రికేయులు ఆర్ ఎరుకు నాయుడుతో పాటు పెద్ద ఎత్తున జర్నలిస్టులు పాల్గొన్నారు.


# రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు మెడికల్ క్యాంపులు




ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ మార్చి 4వ తేదీ విజయవాడలో నిర్వహించిన మహా ప్రదర్శన సందర్భంగా చేసిన డిమాండ్లలో ఒకటైన జర్నలిస్టులకు వారి కుటుంబ సభ్యులకు హెల్త్ క్యాంపులో నిర్వహించాలని డిమాండ్ పై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. అనేక జిల్లాలలో మెడికల్ క్యాంపుల నిర్వహణ సాగింది. జిల్లాలలోని సమాచార శాఖ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరాల నిర్వహణ జరిగింది. సమాచార శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వైద్య శిబిరాలు జర్నలిస్టుల కుటుంబ సభ్యులకు, జర్నలిస్టులకు నిర్వహించినందుకు సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, సమాచార శాఖ డైరెక్టర్ కె ఎస్ విశ్వనాథ్‌లకు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కృతజ్ఞతలు తెలియజేసింది. మార్చి 4 ప్రదర్శన సందర్భంగా లేవనెత్తిన పనులు పలు అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఆరోగ్య జర్నలిస్టుల ఆరోగ్య భీమా కొనసాగింపు కు సంబంధించి కూడా ఏప్రిల్ నెల మొదటి వారంలోనే ఉత్తర్వులు జారీ కావడం పట్ల ఫెడరేషన్ హర్షం వ్యక్తం చేసి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసింది.

# ఎస్ వెంకట్ నారాయణకు జీవనసాఫల్య అవార్డు

ప్రముఖ పాత్రికేయుడు ఎస్ వెంకటనారాయణకు జీవన సాఫల్య అవార్డు లభించింది. హైదరాబాదులో ఏప్రిల్ 19న జరిగిన ఒక కార్యక్రమంలో ఈ అవార్డును బహుకరించారు. అహమ్మదాబాదులో ది టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రికలో రిపోర్టర్‌గా తన జర్నలిజం ప్రయాణాన్ని ప్రారంభించారు. 1975లో లండన్ లోని ఇది సండే టైమ్స్ లో సమ్మర్ స్కాలర్‌గా పనిచేశారు. 1976లో అమెరికాలోని బోస్టన్ నగరంలో ది బోస్టన్ గ్లోబ్ పత్రికలో గెస్ట్ రైటర్‌గా సేవలందించారు. 1979 నుంచి 1984 వరకు ఇండియా టుడే మ్యాగజైన్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్, సీనియర్ ఎడిటర్‌గా ఉన్నారు. అనంతరం లండన్‌కు చెందిన ఈస్ట్ న్యూస్, సిడ్నీకి చెందిన నెట్వర్క్ సెవెన్ సంస్థల్లో సౌత్ ఏషియా బ్యూరో చీఫ్



గా పనిచేశారు. 1999 నుంచి 2025 వరకు మొత్తం పది సంవత్సరాలపాటు ఫారిన్ కరస్పాండెంట్ క్లబ్ ఆఫ్ సౌత్ ఏషియా అధ్యక్షునిగా సేవలందించారు. 1998లో జర్నలిజానికి ఆయన చేసిన సేవలు కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ పొందారు. 2024 లో పొత్తూరి వెంకటేశ్వరరావు స్మారక పురస్కారం అందుకున్నారు. ఆయన కుమారుడు కార్పొరేట్ లాయర్. కమలాపురంలో 2022లో ఎస్ వి ఎన్ ట్రస్ట్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ స్థాపించారు. కమలాపురంలోనే వెయ్యి మంది కూర్చునే సామర్థ్యంతో ఒక కమ్యూనిటీ హాలు నిర్మించి కమలాపూర్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ స్థాపించి విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ అందించే ఏర్పాటు చేస్తున్నారు. ఆయన ఇప్పటికి దాదాపు 68 దేశాలు సందర్శించారు. ప్రపంచంలోని వివిధ దేశాల ప్రముఖులను ఆయన ఇంటర్వ్యూ చేశారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి కృషి




జర్నలిస్టుల సంక్షేమం కోసం తాను నిరంతరం కృషి చేస్తానని రాజమండ్రి శాసనసభ్యులు ఆదిరెడ్డి వాసు హామీ ఇచ్చారు. తూర్పుగోదావరి జిల్లా వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ తొలి మహాసభ రాజమహేంద్రవరం జాంపేటలోని పోలీస్ కన్వెన్షన్ సెంటర్లో ఘనంగా జరిగింది. సీనియర్ జర్నలిస్టు ఎస్ రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ సభకు పెద్ద ఎత్తున పాత్రికేయులు హాజరయ్యారు. ముఖ్యఅతిథి ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని స్పష్టం చేశారు. సభ ప్రారంభంలో జ్యోతి ప్రజ్వలన అనంతరం ఎమ్మెల్యే శాంతి కపోతాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులతో తనకు సుదీర్ఘ అనుబంధం ఉందని వారిని తన కుటుంబ సభ్యులుగా భావిస్తానని పేర్కొన్నారు. భవిష్యత్తులో జర్నలిస్టులకు ఎలాంటి సమస్యలు వచ్చినా ముందుండి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి జర్నలిస్టులకు మరిన్ని సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాష్ రావు మాట్లాడుతూ జర్నలిస్టుల పట్ల తనకు ఉన్న గౌరవాన్ని వ్యక్తం చేశారు. తన రాజకీయ జీవితంలో మూడు తరాల జర్నలిస్టులతో కలిసి పనిచేసిన అనుభవం ఉందని తెలిపారు. జర్నలిస్టులు సమాజానికి అద్దం పట్టే వృత్తిలో ఉన్నారని వారి సేవలు అమూల్యమని కొనియాడారు. ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి జి ఆంజనేయులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు నవీన్ రాజ్, రాష్ట్ర నాయకులు వలి మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఐక్యత అత్యంత అవసరమని తెలిపారు. ప్రభుత్వపరంగా రాయితీలు, భద్రతా చర్యలు కల్పించేందుకు కృషి చేయాలని కోరారు. రాజమహేంద్రవరంలో జరిగిన ఈ మహాసభ విజయవంతం కావడం ఫెడరేషన్ బలోపేతానికి నిదర్శనం అనే అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులను ఘనంగా సత్కరించారు. నగర ప్రముఖులు సువర్ణ వర్తక సంఘం అధ్యక్షులు కడప శ్రీహరి మనీష్ మహిళా పాత్రికేయులు పాల్గొన్నారు. ఏపీడబ్ల్యుజెఎఫ్ తూర్పుగోదావరి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఎన్ రాంబాబు అధ్యక్షుడుగా రవికుమార్, ఉపాధ్యక్షులుగా త్రినాథ్, ఆంజనేయులు, విశాలాక్షి, కార్యదర్శిగా సి. వెంకటేష్ ఎన్నికయ్యారు. సీనియర్ పాత్రికేయులు వడదా నాగేశ్వరరావును రాష్ట్ర నాయకులు సన్మానించారు. సహాయ కార్యదర్శిలుగా సూర్యచంద్రరావు, నరసింహారావు, ఈశ్వర్, కోశాధికారిగా బాబురావు బాధ్యతలు చేపట్టారు. కార్యవర్గ సభ్యులుగా రామ్మూర్తి బి నాగేశ్వరరావు ఎం సుబ్బారావు, ప్రసాద్, కరీముల్లా, పి వినోద్, ఆర్ కె నాయుడు, కే శ్రీనివాస్, హరి, గణేష్, ఏ విజయభారతి, వై శ్రీనివాస్, వినోద్‌లు ఎన్నికయ్యారు.



# విలువల పరిరక్షణ పత్రికలతోనే సాధ్యం




ప్రజాస్వామ్య విలువలు పరిరక్షణ పత్రిక వ్యవస్థతోనే సాధ్యం ప్రజాస్వామ్యంలో పారదర్శక పాలన పరిరక్షణ బాధ్యత పాత్రికేయ సమాజంతోనే సాధ్యమని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి అన్నారు రంపచోడవరం ఆర్‌పి ఫంక్షన్ హాల్లో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా జర్నలిస్టుల తొలి మహాసభను జిల్లా నాయకత్వం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శిరీషాదేవిని పాత్రికేయుల యూనియన్ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ఆరంభించారు. ఆ సమావేశంలో ఆమె మాట్లాడుతూ సమాజంలో ప్రజా సమస్యల పరిష్కార వారధిగా ఉంటే బాధ్యతాయుతమైన నిర్వహణ చేసే వ్యవస్థ పాత్రికేయ రంగం అన్నారు. ఒక వైపు ప్రజా సమస్యల కోసం మరోవైపు ప్రభుత్వ శాఖల కార్య నిర్వహణపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ సక్రమంగా పరిపాలన సాగించేందుకు దోహదపడే కోణాల్లో విలేకరులు పాత్ర అత్యంత కీలకమన్నారు. మెరుగైన సమాజం కోసం పాటుపడే పాత్రికేయుల సమస్యలు మన్యంలో అనేకం అన్నారు. వారి సమస్యల పరిష్కారం కోసం సంబంధిత ఉన్నతాధికారులతోనూ ప్రభుత్వం దృష్టిలో పెట్టి న్యాయం కోసం చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. యూనియన్ సభ్యులు ఆమెను దుశ్శాలువాతో సత్కరించి మోమెంటోబహూకరించారు. కార్యక్రమంలో రంపచోడవరం మాజీ సర్పంచ్ వై నిరంజనీ దేవి, తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనజాల తాతారావు, అను ఒకేషనల్ కళాశాల చైర్మన్ చీకట్ల ఆశీర్వాదం, గిరిజన సంఘం నాయకులు లోత రామారావు, పాత్రికేయ సంఘం నాయకులు చోడిశెట్టి సుబ్బారావు, రామరాజు, శివ, కేశవరపు చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు దంగేటి సత్తిబాబు, జనసేన మహిళా విభాగ నాయకులు పాత్రల సీతామహాలక్ష్మి, తెలుగుదేశం పార్టీ మాజీ మండల పార్టీ అధ్యక్షులు కారం సురేష్ బాబు అధిక సంఖ్యలో పాత్రికేయులు పాల్గొన్నారు. జర్నలిస్టులు సమాజంలో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేస్తూ వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతూ నవ సమాజ అభివృద్ధికి వారదురగా నిలుస్తున్నారని మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ పోలవరం జిల్లా తొలి సమావేశం సందర్భంగా ఆమె మాట్లాడుతూ జర్నలిస్టులు పగలు రాత్రి అనే తేడా లేకుండా నిరంతరం శ్రమిస్తూ ముఖ్యంగా గ్రామాల్లో ఉన్న ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. వృత్తిపరమైన బాధ్యతలు నిర్వర్తించే క్రమంలో అనేక ఆటంకాలు సవాళ్లు ఎదురవుతున్నాయని వాటన్నిటిని అధిగమించి ముందుకు సాగటం అభినందనీయమని పేర్కొన్నారు. ఐక్యతతోనే హక్కుల సాధన సాధ్యమన్నారు. జర్నలిస్టుల సంక్షేమం హక్కుల సాధన గురించి ప్రస్తావిస్తూ జర్నలిస్టులు అందరూ తమ సమస్యల పరిష్కారం కోసం ఒకే తాటిపైకి రావాలన్నారు. జర్నలిస్టుల సంక్షేమ పథకాలు అందేలా ఐక్యంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ ప్రధాన కార్యదర్శి జి. ఆంజనేయులు, ఎన్ఎజె కోశాధికారి ఆకుల అమరయ్య, ఫెడరేషన్ ఉపాధ్యక్షులు నవీన్ రాజ్, ఎంపీపీ బృందం బంధం శ్రీదేవి, జడ్పీటీసీ పండ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిజం కాస్త స్వేచ్ఛగా శ్వాసిస్తోంది




ఒక పెద్దాయన రోడ్ పక్కన నిలబడి ఒకరిని ఇంటర్వ్యూ చేస్తున్నారు. నలిగి పోయిన కుర్తా పైజామాలో ఉన్నారు. ముఖంలో అలనట స్పష్టంగా కనిపిస్తోంది. ఆయనే ప్రణయ్ రాయ్. ఎన్డీటీవీ ఎగ్జిక్యూటివ్‌గా ఉన్నప్పటిలా సూట్‌లో కాకుండా చాలా సాదాసీదాగాఉన్నారు. ఎన్‌డిటీవీ యాజమాన్యం మారి, ఆ అధ్యాయం ముగిసింది. కానీ ప్రణయ్ రాయ్‌లోని జర్నలిస్టు మారలేదు.

డీ కోడర్ యూట్యూబ్ ఛానెల్‌తో ఇప్పుడు ఆయన మళ్లీ గ్రామీణ భారతం దారుల్లోకి వెళ్లారు. 75ఏళ్ల వయస్సులో ఒక చేతిలో బూమ్ మైక్, మరొక చేతిలో మొబైల్ ఫోన్‌తో బెంగాల్, బీహార్ ప్రాంతాల్లో ఓటర్లతో మాట్లాడుతున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో టీ దుకాణాల్లోకి వెళ్లి నిజాయితీగా, మానవీయంగా పాత్రికేయం చేస్తున్నారు. ఇది భారత ప్రజాస్వామ్యం ఎప్పటినుంచో ఆశించినది, కానీ అరుదుగా ఇప్పుడు జరిగింది.

ఆయన తర్వాతి తరం జర్నలిస్టులు ఆయనను అనుకరించాలని ప్రయత్నిస్తున్నారు. కానీ ఎవరూ ఆయన్ని అందుకోలేక పోతున్నారు. ఎందుకంటే ఇదేమీ ఒక టెక్నిక్ కాదు. అది ఒక వృత్తి పట్ల ప్రేమ. ప్రజాస్వామ్యం అనేది యాంకర్ డెస్కుల వద్ద చెప్పే కథ కాదు. అది జిల్లా కేంద్రాల్లో, గ్రామ పంచాయితీలలో వినిపించే కథ. టెలిప్రాంప్టర్ చెప్పలేని భావాలు, భాషలు, చీకటి పల్లెల నిశ్శబ్దాల్లో దాగి ఉంటయి. ఇపుడు ప్రణయ్ రాయ్ ముందున్న రహదారి చాలా పొడవుగా, విశాలంగా ఉంది. ప్రణయ్ రాయ్ మళ్లీ ఆ దారిలో నడుస్తున్నారు. దీనివల్ల జర్నలిజం కాస్త స్వేచ్ఛగా శ్వాసిస్తోంది.



# అర్హులైన జర్నలిస్టులకు సొంత ఇళ్లు

**ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి హామీ.**

అర్హులైన జర్నలిస్టుల సొంత ఇంటి కలను నెరవేరుస్తానని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి హామీ ఇచ్చారు. ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) ఏపీ బీజేఏ ఆధ్వర్యంలో ఏలూరు ఎమ్మెల్యే కార్యాలయంలో బడేటి చంటిని కలిసి జర్నలిస్టులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే బడేటి చంటి, "అర్హులైన జర్నలిస్టులకు సొంత ఇళు ్లు అందించడానికి తాను కృషి చేస్తాను" అని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా ఉంటానని, ముఖ్యంగా వారి ఇళ్ల సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి త్వరితంగా పరిష్కారం కోసం ప్రయత్నిస్తానని తెలిపారు.

ఏపీడబ్ల్యూజేఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి జబీర్, హరీష్ మాట్లాడుతూ ఏలూరు జర్నలిస్టుల ఏ సమస్య ఉన్నా ఎమ్మెల్యే బడేటి చంటి దృష్టికి తీనుకువెళ్తే సానుకూలంగా పరిష్కరించే దిశగా ఆయన అడుగులు వేస్తున్నారు అని అన్నారు. ఏలూరు జర్నలిస్టుల అందరి తరపున ఈ హామీని స్వాగతిస్తున్నామని త్వరలోనే ఈ విషయంలో సానుకూల అభివృద్ధి ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో ఏపీబీజేఏ ఏలూరు జిల్లా అధ్యక్షుడు నారాయణ, ఏపీడబ్ల్యూజేఎఫ్ అక్రిడేషన్ ఎలక్ట్రానిక్ మీడియా కమిటీ మెంబర్ కళ్యాణ్, సుబ్రహ్మణ్యం, వాసు, సాయి, ప్రతాప్, జయరాం, అర్జున్, యూనియన్ నాయకులు ఏలూరు జర్నలిస్టులు పాల్గొన్నారు.




## జర్నలిస్టు తాడి ప్రకాష్‌కు చందు సాహిత్య పురస్కారం

ప్రముఖ జర్నలిస్టు, రచయిత తాడే ప్రకాష్‌ను ప్రతిష్టాత్మక పురస్కారం వరించింది. 2026 సంవత్సరానికి గాను ఆయన డాక్టర్ చందు సుబ్బారావు సాహిత్య ట్రస్టు పురస్కారానికి ఎంపికయ్యారు. ఆచార్య చందు సుబ్బారావు లిటరరీ అండ్ కల్చరల్ ట్రస్ట్ చైర్మన్ పూర్వ యూపీఎస్సీ సభ్యుడు ప్రొఫెసర్ కెఎస్ చలం, కార్యదర్శి ఉప్పల అప్పలరాజు అవార్డు ప్రకటించారు. తాడి ప్రకాష్‌కు పురస్కారాన్ని ప్రధానం చేసే సభకు చలం అధ్యక్షత వహిస్తారు. ప్రసిద్ధ రచయితలు అట్టాడ అప్పలనాయుడు, జిఎస్ చలం, లీడర్ పత్రిక సంపాదకుడు వివి రమణమూర్తి ఆత్మీయ అతిథులుగా పాల్గొంటారు. విశాఖపట్నం ద్వారకా నగర్‌లోని గ్రంథాలయం హాల్లో ఈ సభ జరుగుతుంది.

## ఎన్టీఆర్ జిల్లా మహాసభకు సన్నాహాలు

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఎన్టీఆర్ జిల్లా మహాసభలకు సన్నాహాలు ముమ్మరంగా సాగుతున్నాయి. అందులో భాగంగా ఇబ్రహీంపట్నం ప్రజాప్రెస్‌క్లబ్‌లో జిల్లా మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు ఎన్టీఆర్ జిల్లా మహాసభ మే 17న నిర్వహించనున్నట్లు ఫెడరేషన్ నాయకులు తెలిపారు.




# వైట్ హౌస్ పాత్రికేయుల విందులో కాల్పుల కలకలం

అమెరికా శ్వేతసౌధం సమీపంలో జరిగిన కాల్పుల ఘటన కలకలం రేపింది. వాషింగ్టన్ డిసి లోని హిల్టన్ హోటల్లో జరిగిన వైట్‌హౌస్ పాత్రికేయుల విందు కార్యక్రమంలో కాల్పులు జరిపాడు. అయితే ఈ ఘటంలో ఎవడు గాయపడలేదు కాల్పులు జరిగిన వెంటనే దేశాధ్యక్షుడు జేడీ రైమ్స్ రక్షణ మంత్రి పీట్ హెడ్సెట్ విదేశాంగ మంత్రి మార్క్ రూబియోలను అక్కడి నుంచి హుటాహుటిన తరలించారు. ఐదు నుంచి ఎనిమిది రౌండ్ల కాల్పులు జరిగాయని ఘటనా స్థలంలో ఉన్న కొందరు వ్యక్తులు తెలిపారు. ప్రాణభయంతో అనేకమంది అతిథులు టేబుల్స్ కింద దాక్కున్నారు. షాట్‌గన్, హ్యాండ్‌గన్‌తో పాటు అనేక కత్తులతో వచ్చిన నిందితుడు భద్రత వలయాన్ని దాటుకొని లోపలికి ప్రవేశించి హఠాత్తుగా కాల్పులు మొదలుపెట్టాడు. కాగా సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు అధికారులు అద్భుతంగా పనిచే పనిచేశారని తామంతా క్షేమంగా ఉ న్నామని ట్రంప్ చెప్పారు. కాల్పులు జరిపిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఇరాన్ పై తాను జరుగుతున్న యుద్ధానికి ఈ దాడికి సంబంధం ఉన్నదని అనుకోవడంలేదని అన్నారు. కాల్పులు జరిపేందుకు పథకాన్ని రూపొందించుకున్న నిందితులు హోటల్లోనే ఆయుధాన్ని సిద్ధం చేసుకున్నాడని ప్రత్యక్ష సాక్షి ఒకరు చెప్పారు. శీతల పానీయాలు ఉంచే గది సమీపంలో పెద్దగా భద్రత ఏర్పాట్లు ఉ ండవని తెలుసుకుని కోల్‌టా అమౌంట్ అలెన్ అక్కడే దాక్కున్నాడని. ఓ బ్యాగ్ నుంచి పొడవైన తుపాకిని బయటకు తీశాడని ఆ తర్వాత ఆకస్మికంగా విందు జరుగుతున్న బాల్‌రూమ్ వైపు ఆ తుపాకీ పట్టుకొని పరుగులు తీశాడని వివరించారు. కాల్పులకు పాల్పడిన కోల్‌టామోస్గా కాలిఫోర్నియాలోని లాస్ ఏంజెల్స్ శివారులో ఉన్న టోరెంట్స్ ప్రాంతానికి చెందినవారు. కాలిఫోర్నియాలో 2017లో మెకానికల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ చదివారు. విద్యార్థిగా ఉన్న సమయంలోనే వీల్ చైర్స్ కు అత్యవసర బైకులను ప్రయోగాత్మకంగా తయారు చేసి ప్రశంసలు పొందారు ఆ తర్వాత కాలిఫోర్నియాలో స్టేట్ యూనివర్సిటీ మాస్టర్ డిగ్రీ పూర్తి చేశారు.



# పాత్రికేయులకు నెరవేరని సొంత ఇంటి కల

రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల పెండింగ్ సమస్యలు పరిష్కారానికి సంబంధించి త్వరలో మరోసారి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలవాలని కార్యవర్గం నిర్ణయించడం జరిగిందని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి (ఎన్ఏజే ) ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్షులు పి నారాయణలు తెలిపారు. విశాఖపట్నం అక్కయ్యపాలెం జంక్షన్ వద్దనున్న ఒక ప్రైవేట్ హోటల్ లో మే 7న ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టులు ఫెడరేషన్, ఏపీ బ్రాడ్ కాస్ట్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్‌ల కార్యవర్గ సభ్యులు సమావేశమై జర్నలిస్టులకు సంబంధించిన కొన్ని ప్రధాన అంశాలపై చర్చించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో తక్షణమే మూడు డిమాండ్లు పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని నిర్ణయించుకోవడం జరిగిందన్నారు. దశాబ్దాల తరబడి పాత్రికేయుల సొంత ఇంటి కల నెరవేరలేదన్నారు. అన్ని వర్గాల సమస్యలను పరిష్కరించడంతోపాటు వారి సంక్షేమానికి కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను కూడా వీలైనంత త్వరగా పరిష్కరించాలని కోరడం జరుగుతుందన్నారు. తక్షణమే ఇళ్ల స్థలాలు, ఇల్లు మంజూరు చేయాలని, ప్రమాద బీమా పాలసీ పునరుద్ధరించాలని, పదవి విరమణ పొందిన జర్నలిస్టులకు పెన్షన్ సదుపాయం కల్పించాలన్నదే తమ ముఖ్య డిమాండ్లుగా పేర్కొన్నారు. వీటికి సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఆయా సమస్యలను వివరించడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది ఎలాగైనా ఆయా డిమాండ్లు పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. అలాగే యూనియన్ బలోపేతానికి సంబంధించి మరిన్ని చర్యలు చేపడతామని వీరు చెప్పారు. సమావేశంలో ఫెడరేషన్ విశాఖ జిల్లా కార్యదర్శి జి శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు ధవలేశ్వరపు రవి కుమార్, ఏ సాంబశివరావు, ఉపాధ్యక్షులు పి నగేష్ బాబు, బ్రాడ్ కాస్ట్ కార్యదర్శి కింతాడ మదన్, ఉపాధ్యక్షులు శేషు, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్మోహన్, కార్యదర్శి కె .శ్రీనివాసరావు, ఇతర ప్రతినిధులు బొబ్బరి ప్రసాద్, హరి, కోశాధికారి కె వి శర్మ, రవిశంకర్, రాజశేఖర్, జగన్నాథంలతోపాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ఫెడరేషన్ నియోజకవర్గ కమిటీ ఏర్పాటు

జర్నలిస్టుల సమస్యలపై ఎపిడబ్ల్యుజెఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని జర్నలిస్టుల హక్కుల కోసం ప్రభుత్వాలను ప్రశ్నిస్తుందని ఫెడరేషన్ ఉపాధ్యక్షులు బి ఎన్ ప్రసాద్ అన్నారు. చిలకలూరిపేటలోని ఏపీడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా పి శ్రీనివాసరావు, కార్యదర్శిగా ఎస్కె నాగూర్ వలి ఎన్నికయ్యారు, ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఎం పట్టణ కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి వాస్తవాలను వెలుగులోకి తెస్తూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలుస్తున్న జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందుతున్నాయన్నారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ చేసే పోరాటాలకు తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు. జిల్లా నాయకులు పచ్చవ బుజ్జిబాబు, దరువురి బాబు తదితరులు నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కే సుధాకర్, రఫీ, నాసర్‌వలి, జాఫర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నమయ్య జిల్లా కమిటీల ఏర్పాటు





అన్నమయ్య జిల్లా ఎన్నికలు ఏప్రిల్ 25 26 తేదీల్లో విజయవంతంగా ఏకగ్రీవంగా జరిగాయి. చిత్తూరు జిల్లాలో జరిగిన విధంగానే ముందుగా జిల్లా కమిటీ ఎన్నికలు నిర్వహించి కొత్త కమిటీ నేతృత్వంలో మహాసభలు నిర్వహిస్తారు. అన్నమయ్య జిల్లా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ కమిటీ గౌరవ అధ్యక్షులుగా బి.మురళిమోహన్ (ఆంధ్రజ్యోతి), అధ్యక్షులుగా జి.రమేష్ బాబు (టివి5), వర్కింగ్ ప్రసిసెంట్‌గా ఇ.మురళి (ప్రజాశక్తి), ఉపాధ్యక్షులుగా టి.గిరిశేఖర్ (ఆంధ్రజ్యోతి), కథారి రామయ్య (వార్త), సి.గురుప్రసాద్ (ప్రజాశక్తి), మంజుల శ్రీనివాస్ (ఐన్యూస్), పి.శ్రీనివాసులు (సూర్య), కె.విజయకుమార్ (సూర్య), బి.వెంకటరమణ (నేటి మనదేశం), ఎన్.రవీంద్ర (కురుక్షేత్రం), కార్యదర్శిగా పి.ఎ.హిదాయతుల్లా (అప్ప), (రాజ్ న్యూస్), ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం.శ్రీనివాసరావు (స్లైలైన్), సహాయ కార్యదర్శులుగా బి.సురేష్ బాబు (ఆంధ్రజ్యోతి), ఎ.రామాంజులు (సాక్షి), వి.పురుషోత్తం (వార్త), ఎల్.నాగరాజు (వార్త), ఎస్.ఖాదర్ భాషా (ప్రజాశక్తి), కె.డేవిడ్‌కుమార్ (ప్రజాశక్తి), ఎం.శ్రీనివాసులు (ఆంధ్రపత్రిక), జి.వి.శేషగిరి (ఎబిఎన్ డైలి), ఎం.వెంకటరమణారెడ్డి (జనసేన న్యూస్), కోశాధికారి ఎస్.లోకేష్ (ప్రజాశక్తి) లీగల్ సెల్ సలహాదారుగా డాక్టర్ టి.శ్రీనివాసులు (ఆంధ్రప్రభ) ఎన్నికయ్యారు.

ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్ అన్నమయ్య జిల్లా కమిటీ గౌరవాధ్యక్షులు జి.ఆర్.మురళి(ఎబిఎన్), అధ్యక్షులు వి.రెడ్డిప్రసాద్(ఎన్‌టీవీ), వర్కింగ్ ప్రసిడెంట్ సి.శ్రీనివాసులు (ఎన్‌టీవీ), ఉపాధ్యక్షులుగా శివశంకరరాజు (మహాన్యూస్), ఎం.వి.బాలాజీ (రాజ్ న్యూస్), ఎం.భానుకిరణ్ (రాజ్ న్యూస్), సి.రామకృష్ణారెడ్డి (హెచ్‌ఎంటివి), ఎన్.ఆదినారాయణ (99టివి), రెడ్డి రాజా (99టివి), కె.విజయభాస్కర్ (సుమన్‌టివి), ఎస్.కార్తీక్ విజయ్ (సిటీ కేబుల్), కార్యదర్శి సి.రమేష్ బాబు (హెచ్‌ఎంటివి), ఆర్గనైజింగ్ సెక్రటరీ సి.రవికిషోర్ (బిగ్ టివి), సహాయ కార్యదర్శులుగా బి.రవినాయక్ (సాక్షి టివి), ఎం.రవినాయుడు (హెచ్‌ఎంటివి), డి.ఎస్.లక్ష్మీపతి (10టివి), షేక్ అస్లాం (99టివి), బి.కె.రవికుమార్ (బిగ్‌టివి), బి.మణికుమార్ (ఎన్.హెచ్ న్యూస్), ఎన్.కుమార్ (ఎన్ ఎస్ ఎన్ తెలుగు), నజీర్ సాహెబ్ (మెట్రో టివి), ఎ.కుమార్ (సి5టివి),కోశాధికారిగా యు.శ్రీనివాసులు (హెచ్‌ఎంటివి) ఎన్నికయ్యారు.

మదనపల్లిలో అన్నమయ్య జిల్లా కార్యవర్గ ఎన్నికలు జిల్లా కన్వీనింగ్ కమిటీ నేతృత్వంలో జిల్లా ఎన్నికల అధికారి నిర్వహించారు. ఈ ఎన్నికలకు జిల్లా ఎన్నికల అధికారులుగా కె.మంజునాథ్, ఎన్ మోహన్‌లను జిల్లా కన్వీనింగ్ కమిటీ నియమించింది. ఏప్రిల్ 16వ తేదీ నుండి 23వ తేదీ వరకు సభ్యత్వ నమోదు, ఏప్రిల్ 24న ఎన్నికల జాబితా ప్రచురణ, ఏప్రిల్ 25 ఉదయం పదిగంటల నుండి 12 గంటల వరకు నామినేషన్ల దాఖలు ప్రక్రియ, ఏప్రిల్ 25న 12 గంటల నుంచి 1:00 వరకు నామినేషన్ల పరిశీలన, మధ్యాహ్నం ఒంటిగంట నుండి నాలుగు గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ జరిగాయి. ఏప్రిల్ 25న సాయంత్రం ఐదు గంటలకు పోటీలోని అభ్యర్థుల తుది జాబితా విడుదల చేశారు. ఏప్రిల్ 26న ఉదయం 10 గంటలకు అన్ని పదవులకు ఒక్కొక్కరే పోటీలో ఉన్నందున కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయినట్టు ఎన్నికల అధికారి ప్రకటించారు. ముఖ్యఅతిథిగా ఏపీడబ్ల్యూజేఎఫ్ రాయలసీమ జిల్లాల ఇన్చార్జి కవరకుంట్ల జయరాజ్. చిత్తూరు జిల్లా కార్యదర్శి సలీం, జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులు జాకీర్ హుస్సేన్, కో కన్వీనర్లు. రామకృష్ణ రెడ్డి, లోకనాథ రెడ్డి, వీ. శ్రీనివాసులు నాయుడు, షేక్ సలీం బాషా, పి.ఏ. హిదాయతుల్లా (అప్పా), రషీద్, శ్రీనివాసులు, రమణలు పాల్గొన్నారు.

# చిగురుటాకులా వణికిన “నాలుగో స్తంభం”!

ఎ.అమరయ్య

ఇవాళ పొద్దున్నే మిత్రుడు కొమ్మాలపాటి శరత్ కాల్ చేసి “ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవం” అంటూ శుభాకాంక్షలు చెప్పగానే నా మనసు కలుక్కుమంది. మనసు చివుక్కుమంది.

నిన్న అనంతపురంలో ఓ విలేఖరికి జరిగిన ఘోర అవమానం గుర్తుకొచ్చి రాత్రి సరిగా నిద్ర పట్టలేదు. తెల్లారేపాటికి ఈ ఫోన్... భలే నవ్వొచ్చింది. ఎవరికి స్వేచ్ఛ? ఎవరికి స్వాతంత్ర్యం?

మేనేజ్‌మెంట్‌లోని కొందరు– రాయమన్నది రాశానని చెప్పిన విలేఖరి– కాళ్లు పట్టుకుని వేడుకుంటుంటే, ఆమె మరింత రెచ్చిపోయి– ముఖం చిట్లించి, పళ్లు పటపటమని కొరికి పెద్ద గొంతుతో అతని కాలర్ పట్టుకుని– బజారు రౌడీని గుంజినట్టు గుంజిన వీడియోలు చూస్తుంటే నాకు ఒళ్లు మండిపోయింది.





‘నాలుగో స్తంభం’ అంటూ మావాళ్లు చేసే నినాదాలు గుర్తుకొచ్చాయి. ఇప్పుడు వాటిని చూసే చిగురుటాకులా వణుకుతున్న తీరు మదిలో మెదిలింది. ఆ విలేఖరి ఇంటికి వెళ్లి ఆయన పెళ్లాం బిడ్డల్ని పక్కకు తోసేసి తన కాలేజీ స్టాఫ్ తో వీడియో తీయించి బయటి ప్రపంచానికి వదిలారంటే ఆమెకున్న ధైర్యం ఏపాటిదో అర్థమవుతోంది.

ఆమె అంతటితో వదల్లేదు. ఆ తర్వాత ఆమె తన మందీ మార్బలంతో అనంతపురం ప్రెస్ క్లబ్ మీద ఎగబడిన తీరు ‘అంకుశం’ సినిమాలో విలన్ బరి తెగింపును గుర్తుకు తేకమానదు. పోనీ, ఆమేమైనా రాజకీయ నాయకురాలా అంటే అదీ కాదు. అలా అని బడా డాన్ కూడా కాదు. కేరళ నుంచి వచ్చిన వాళ్ల నాయన ఓ మెకానిక్ షాపు నడుపుతూ పిల్లల్ని పెంచి పెద్ద చేస్తే –చదువుకున్న ఈ మహిళ ఇలా తెగబడింది. ఆమె పేరు మనీషా నాయర్. ఓ కాలేజీని నడుపుతున్న వ్యక్తి.

ఆ విలేఖరి తప్పు రాస్తే దాన్ని ఖండించడానికి అనేక దారులున్నాయి. క్రిమినల్ కేసు పెట్టి బొక్కలో వేయించవచ్చు. పరువునష్టం కేసు వేసి కోర్టుకు ఈడ్చవచ్చు. అదీ వద్దనుకుంటే అనంతపురంలోని ప్రెస్ క్లబ్ మొదలు ఢిల్లీలోని ప్రెస్ కౌన్సిల్, ఆ పక్కనే సుప్రీంకోర్టు, బెజవాడలో హైకోర్టు దాకా లాగవచ్చు. దీనికి బోలెడన్ని చట్టాలు, లాలు, కమిషన్లు, కాకరకాయలనేకం ఉన్నాయి. కానీ కర్ర ఉన్నోడిదే బర్రె అన్నట్టు చంపేస్తారా? దౌర్జన్యం చేస్తారా? కాళ్లకు దండాలు పెట్టించుని దండాలేయిస్తారా? ఇదేం ప్రజాస్వామ్యం, ఇదేం నాలుగో స్తంభం.

మేనేజ్‌మెంట్ ఆదేశాల మేరకు పని చేసే విలేఖరులు బలిపశువులుగా మారడం, బయటి వ్యక్తులు ప్రెస్ క్లబ్ వంటి సంస్థల మీద పడి వీరంగం చేయడం జర్నలిజంపై జరుగుతున్న దాడికి పరాకాష్ఠ. పక్కనే ఉన్న చిత్తూరు జిల్లాలో ఓ ఎర్రచందనం స్మగ్లర్ కత్తివేటు బలైన ఓ విలేఖరి నెత్తుటి మడుగు ఇంకా ఆరకమునుపే జరిగిన ఈ ఘటన జర్నలిస్టులకున్న బతుకు భద్రతను పరిహాసం చేస్తోంది. అయినా, అంతర్జాతీయ పత్రికా స్వేచ్ఛా దినోత్సవమంటూ అభినందనలు, ఆలింగనాలు చేసుకుంటూ బతికేద్దామా! గొంతెత్తి నిరసిద్దామా..!?

కేవలం జర్నలిస్టులే కాదు–మొత్తం పౌరసమాజం ఆలోచించాల్సిన ప్రశ్న ఇది. ఇక్కడ అసలైన స్వేచ్ఛ ఎవరికి ఉంది? నిజాయితీగా రాసేవారికా.. లేక రాయనీయకుండా రౌడీయిజం చేసేవారా? ఇలాంటి అరాచకాలకు అడ్డుకట్టవేయకపోతే న్యాయం చచ్చిపోయినట్టే. అప్పుడు ‘పత్రికా స్వేచ్ఛ’ ఉత్తుత్తి మాటే. ఇవాళ నొక్కేది ఓ విలేఖరి గొంతే కావొచ్చు, అది రేపు మీ దాకా రాదన్న భరోసా ఉందా?!




# జర్నలిస్టుల సమస్యలపై అలుపెరుగని పోరు


రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం స్పందించి వెంటనే హెల్త్ కార్డులు, ఇల్లు లేని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఇదే కాకుండా చాలీచాలని వేతనంతో సమాజం కోసం శ్రమించే జర్నలిస్టులకు అన్ని ప్రయోజనాలు కలుగజేసే విధంగా ప్రభుత్వం చొరవ చూపాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి జి ఆంజనేయులు అన్నారు. తిరుపతి నగర పరిధిలోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయం వేదికగా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ ఫెడరేషన్ తిరుపతి జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆంజనేయులు జర్నలిస్టుల సంక్షేమానికి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలు నియోజకవర్గాలు మండల కేంద్రంలో ఫెడరేషన్ నాయకత్వాన్ని బలపరుస్తూ జర్నలిస్టులకు ముఖ్యంగా అవసరమైన ప్రతి అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామన్నారు. జర్నలిస్టులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు, ముఖ్యంగా జర్నలిస్టులకు మీడియా కమిషన్ ఏర్పాటుతో పూర్తి హక్కులు, లబ్ధి, రక్షణ ఉంటుందని ఆంజనేయులు స్పష్టం చేశారు. జర్నలిస్టుల ప్రయోజనాలే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్



ఫెడరేషన్ పనిచేస్తుందని స్పష్టం చేశారు. నూతనంగా ఎన్నికైన ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ ఫెడరేషన్ తిరుపతి జిల్లా కమిటీ ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఆదిమూలం శేఖర్ నుంచి నూతన కమిటీ నాయకత్వం నియామక పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి. చెంగల్ రాయలు, వలిగలం గోపి, ఆంధ్ర ప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ కె. మునిరాజు, సీనియర్ జర్నలిస్టు ఆలూరు గిరిధర్, మోహన్ రావు, ప్రసాద్ రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గ ఏపీడబ్ల్యుఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా ఎస్ జయచంద్ర, జయప్రద కోశాధికారి భీమయ్యలను ఎన్నికయ్యారు. ఏపీ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ తిరుపతి జిల్లా అధ్యక్ష కార్యదర్శులను ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా దాచేపల్లి కిరణ్, కార్యదర్శిగా ఎస్ అశోక్ రాజు, కోశాధికారిగా రమణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎపిబిజెఎ రాష్ట్ర కన్వీనర్ కొట్టే మునిరాజు వారికి శుభాకాంక్షలు





తెలియజేశారు. పెద్ద సంఖ్యలో జిల్లా నలుమూలల నుంచి ఫెడరేషన్ సభ్యులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

# లేబర్ కోడ్స్ అమలు తర్వాత నూతన పరిస్థితులలో కార్మికోద్యమ గమనంలో మార్పులు - ఒక పరిశీలన

పి.ప్రసాదు

దాదాపు పదేండ్ల నుంచి లేబర్ కోడ్స్ అమలు కోసం భారత పారిశ్రామిక (ముఖ్యంగా కార్పొరేట్) వర్గాలు చకోర పక్షుల్లా ఎదురు చూస్తున్నాయి. వారి దురాశలు ఎట్టకేలకు ఫలించాయి. వాటిని అమలులోకి రాకుండా అడ్డుకోవాలని ఇంతకాలం భారత కార్మికోద్యమం ప్రయత్నించింది. దాని ప్రయత్నం, సంకల్పాలు ఫలించలేదు. అయినా, అది ఆఖరి వరకూ ఆశ వదులుకోకుండా ప్రయత్నించింది. 1-4-2026 తేదీ నుంచి లేబర్ కోడ్లను అమలు చేస్తామని మోడీ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఆ తర్వాత కూడా కార్మికవర్గం తన ఆఖరి ప్రయత్నంగా ఫిబ్రవరి 12వ తేదీన సార్వత్రిక సమ్మెను చేపట్టింది. అది కూడా మోడీ ప్రభుత్వ వైఖరిని మార్చలేకపోయింది. ఏమైనా తాత్కాలికంగా కార్పొరేటు వ్యవస్థ లక్ష్యం ఫలించింది. 2026 ఏప్రిల్ ఫస్టు నుంచి లేబర్ కోడ్స్ ఒక భౌతిక వాస్తవంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత కార్మికోద్యమ గమనంలో చేపట్టాల్సిన నూతన కర్తవ్యాలు, ఎత్తుగడలు గూర్చి స్పందిస్తున్నాను.

లేబర్ కోడ్స్ అమల్లోకి రాకముందు పరిస్థితికీ, అమలులోకి వచ్చిన తర్వాత పరిస్థితికీ మధ్య తేడా వుంటుంది. ఇవి ఆకాశంలో దట్టంగా నల్లటి కారు మబ్బులు కమ్ముకొస్తున్న పరిస్థితికీ, మేఘాలు కుంభవర్షాన్ని కురుస్తున్న పరిస్థితికీ మధ్య తేడా వంటిదే. పాములు సంచరించే పంట పొలాలలో రైతులు ప్రదర్శించే అప్రమత్తతకీ, పాము ఎదురుపడి బుసకొట్టే క్షణాల్లో ప్రదర్శించే అప్రమత్తత, సన్నద్ధతలకూ మధ్య తేడా వంటిదే. లేబర్ కోడ్స్ వల్ల రానున్న నష్టాలు, కష్టాల గూర్చి ఇంతవరకూ కార్మిక సంఘాల నాయకత్వ శ్రేణులు కార్మికవర్గాన్ని చైతన్యపరిచాయి. వారిని సమైక్య, సంఘటిత, సమరశీల ఆందోళనకు సంసిద్ధం చేశాయి. ఆ నిర్దిష్ట సన్నద్ధ దశకు ఇకనుంచి ప్రాసంగికత వుండదు. ఇక లేబర్ కోడ్స్ భౌతిక వాస్తవంగా మారాయి. దీనితో నూతన భౌతిక పరిస్థితులు ఏర్పడతాయి. లేబర్ కోడ్స్ వల్ల కార్మికవర్గానికి జరిగే కష్టాలు, నష్టాలు ఇకనుంచి రేపటి మాట కాదు. అది ఇక నేటి మాటగా మారుతుంది. ఈ నూతన భౌతిక పరిస్థితులకు తగినట్లు కార్మికోద్యమ నాయకత్వ శ్రేణుల భాషతో సహా బోధనలు, ఎత్తుగడలు, కర్తవ్యాలు కూడా మారాలి. ఇంకా పాత భాష, భావనల ప్రకారం అనుసరిస్తే పడికట్టు భాషగా, యాంత్రిక పని విధానంగా మారుతుంది. ఈ అనుభవ కోణంతో స్పందించి రాస్తున్న వ్యాసమిది.

ఎలుగుబంటి, తోడేళ్ళ వంటి జంతువులు తమ పంట పొలాలలో సంచరించే కాలంలో రైతులు వాటికి భయపడి పంట సాగును ఆపివేయరు. వాటి ప్రమాదాలను ఎదుర్కొని అధిగమిస్తూ పంట సాగు చేస్తుంటారు. తమ పంట సాగు కర్తవ్యానికి లోబడి ఎలుగుబంటి, తోడేళ్ళ వంటి జంతువుల ప్రమాదాన్ని ఎదుర్కొనే కర్తవ్యాలు చేపడతారు. కార్మికవర్గానికి లేబర్ కోడ్స్ సృష్టించే కష్టాలు, నష్టాలూ అలాంటివే. కార్మికోద్యమ గమన దారిలో లేబర్ కోడ్స్ ఒక నిర్దిష్ట దశలో ఎదురయ్యే ఒక ఆటంకం మాత్రమే. అలా ఎదురైన ఆటంకాన్ని బట్టి కార్మికవర్గ పోరాట గమనం ఆగిపోదు. తన గమనంలో ఎదురయ్యే ఆటంకాలను అధిగమిస్తూ పురోగమించడం కార్మికోద్యమ కర్తవ్యంగా మారాల్సి వుంది. లేబర్ కోడ్స్ సృష్టించే నూతన ప్రతికూల భౌతిక పరిస్థితిని ఎదుర్కొని అధిగమించాలి. ఈ నిర్దిష్ట దశలో కార్మికోద్యమ శ్రేణులు నిర్దిష్ట అవగాహనతో పురోగమించాల్సి వుంది.

ఫలానా నిర్దిష్ట వ్యాధికి గురికానంత కాలం ఆ వ్యాధి వ్యాప్తి కాకుండా నివారణ చర్యల పట్ల జాగ్రత్త వహించడం సరైన ప్రక్రియ అవుతుంది. అంతేతప్ప ఆ వ్యాధి సోకక ముందే చికిత్స చేపట్టడం సరికాదు. కానీ, వ్యాధి నివారణ చర్యలు విఫలమై వ్యాధిగ్రస్తులమైన తర్వాత చికిత్స అనివార్యం అవుతుంది. ఆ తర్వాత వ్యాధి నివారణ చర్యలతో దాని నియంత్రణ జరగదు. లేబర్ కోడ్స్ కూడా యిలాంటివే. వాటివల్ల భావి దుష్ఫలితాల గూర్చి చైతన్యపరచడం, ఇక ముందు తక్షణ, ప్రధాన కర్తవ్యం కాజాలదు. దానికి కాలదోషం పట్టింది. అది ద్వితీయ ప్రాధాన్యత గల కర్తవ్యంగా మారింది. వాటి దుష్ఫలితాలు, పర్యవసానాలకు వ్యతిరేకంగా సమీకరించి వుద్యమించడం తక్షణం ప్రధాన కర్తవ్యంగా మారుతుంది. ఈ దృష్టికోణం కార్మికవర్గ విప్లవ సంస్థలకు వుండాలి.

లేబర్ కోడ్స్ వల్ల కలగనున్న నష్టాలు, కష్టాలు, దుష్ఫలితాల గూర్చి కార్మికవర్గంలో కార్మికోద్యమ సంస్థల ఆర్గనైజర్లు, కార్యకర్తలు సాగించే ప్రచార పద్ధతులు సమతూకంతో వుండాలి. అవి సమతుల్యతను కోల్పోతే, కార్మికవర్గాన్ని నిరాశకు గురిచేసే ప్రమాదం కూడా వుంది. నిజానికి పాత కార్మిక చట్టాల కాలం కార్మికవర్గానికి స్వర్ణయుగం కాదు. లేబర్ కోడ్ల అమలుతో రేపటి నుంచి ఉనికిలోకి వచ్చేకాలం వెలుగు కనపడని అంధకార యుగం కాదు. ఈ రెండు భిన్న కాలాలలో కూడా కార్మికవర్గం అనుభవించే

హక్కులు, సౌకర్యాలకు ప్రాథమిక షరతు కార్మికవర్గ సంఘటితశక్తి మాత్రమే. అట్టి సంఘటిత సమరశీల శక్తిని ప్రదర్శించకుండా గత కార్మిక చట్టాలను అమలుచేయించుకొని, వాటి ఫలితాలను కార్మికవర్గం అనుభవించ లేకపోయింది. అదే విధంగా కార్మకవర్గ సంఘటితశక్తి వున్న పరిస్థితులలో లేబర్ కోడ్స్ కార్మికవర్గాన్ని చీకటియుగంలోకి నెట్టలేవు. ఈ ప్రాథమిక సూత్రం పట్ల స్పష్టమైన రాజకీయ అవగాహన కార్మికోద్యమ శక్తులకు వుండాలి. ఒకవేళ ఈ సమతుల్యతా దృష్టి కోణాన్ని విస్మరిస్తే, కార్మికవర్గంలో ఆశాజనక పరిస్థితిని సృష్టించడానికి బదులు, నిరాశ వైపు నెట్టే ప్రమాదం వుంది.

ఆయా కాలాలలో నాసా, పోటా, టాడా, ఉపా వంటి నిర్బంధ చట్టాలు నిరంకుశ, ఫాసిస్టు పాలకవర్గాలు అమలులోకి తెచ్చాయి. వాటికి వ్యతిరేకంగా హక్కుల సంస్థలు గానీ, వుద్యమ సంస్థలు గానీ చేపట్టే ప్రచార పద్ధతులు పీడిత ప్రజల మనస్సుల్లో భీతావహ పరిస్థితిని సృష్టించే అవకాశాన్ని యిచ్చే విధంగా వుండరాదు. వాటిని సైతం త్రిప్పికొట్టి అధిగమించగలమనే ఆశ, విశ్వాసాలను కలిగించడం ద్వారా వారిని చైతన్యపరిచేవిగా రూపొందించాలి. అంతేతప్ప రానున్న నిర్బంధ తీవ్రతను గూర్చి అతిగా చేసి చూపించే ప్రచార సరళి పీడిత ప్రజలను భీతిల్లజేసి వుద్యమాలకు దూరం చేయడానికి దారి తీసేదిగా వుండరాదు. ఆ విధంగా ప్రచారం చేస్తే ఆచరణలో పాలకవర్గాల లక్ష్యానికే పరోక్షంగా ఉపయోగపడుతుంది. తద్వారా ఆ సర్కార్లు ఆ చట్టాల్ని అధికారికంగా అమలుచేయక ముందే, అవి ఆశించే ఫలితాలను సాధించే అవకాశాన్ని కల్పిస్తుంది. అది లేబర్ కోడ్ల దుష్ఫలితాల గూర్చి అతిగా సాగించే ప్రచార సరళికి కూడా వర్తిస్తుంది. కార్మికవర్గాన్ని నిరాశా, నిస్పృహలకు గురిచేసే ప్రచార సరళికి చోటు యివ్వరాదు. కార్మికవర్గ విప్లవ సంస్థలకూ, మరీ ముఖ్యంగా ఆ సంస్థల రాజకీయ శ్రేణులకూ ఇలాంటి దృష్టికోణం వుండాలి.

గత కొన్నేండ్లలో అనేక లేబర్ కోడ్స్ వ్యతిరేక సభా వేదికలలో పాల్గొన్న స్వానుభవంతో నేనొక విషయాన్ని ప్రస్తావన చేస్తున్నా. 'ప్రపంచానికి ఆఖరి ఘడియలు- వంటి వైజ్ఞానిక గ్రంథాలు ప్రచురించిన కాలంలో లేదా స్కైలాబ్ పడుతుందని భావించిన కాలంలో మానవజాతిని భీతిల్లజేసిన గత చేదు అనుభవాలు తెలిసిందే. మానవజాతికీ ఇక 'రేపు' అనేది వుండదనే నిరాశకు గురిచేసింది. అదేవిధంగా 2026 ఏప్రిల్ ఫస్టు తారీఖు నుంచి కార్మికవర్గానికి మనుగడ లేదన్నట్లుగా సాగించే కొందరు కార్మిక నేతల ప్రసంగాలను వింటున్నాం. అనేకసార్లు ట్రేడ్ యూనియన్ల ఐక్య సభా వేదికలపై కొందరు కార్మిక నాయకులు చేసే ప్రసంగాల్లో సమతుల్యత లోపిస్తున్నది. తద్వారా వాస్తవ కార్మికవర్గానికి ఓ నిరాశాజనక సందేశాన్ని యిచ్చే ప్రమాదం వుంది. నిజానికి సదుద్దేశ్యం తప్ప నిరుత్సాహం కలిగించే ఉద్దేశ్యం వారికి లేదు. లేబర్ కోడ్స్ పట్ల కార్మికుల్లో వ్యతిరేకతను పెంచే సదుద్దేశ్యం తప్ప వారికి మరో దృష్టి లేదు. వాటిని అమలుచేసే ఫాసిస్టు పాలకవర్గాల పట్ల కార్మికవర్గంలో రాజకీయ ద్వేషాన్ని కలిగించే సదుద్దేశ్యంతో ప్రచారాన్ని నిర్వహిస్తున్నది వారే. మానసికంగా వారి ఉద్దేశ్యం ఏమిటనేది ముఖ్యం కాదు. వారు సదుద్దేశ్యంతో చేసే ప్రచార పద్ధతులు కూడా గురితప్పితే కార్మికవర్గం మీద దుష్ప్రభావాలుగా మారే అవకాశం వుంది. ఈ దృష్టికోణం కార్మికవర్గ విప్లవ సంస్థల రాజకీయ శ్రేణులకు వుండాలి.

స్కైలాబ్ పడ్డ తర్వాత రేపు అనేది వుండదనే భావాన్ని కలిగించాక, ఇళ్ళలో పెంచుకున్న మేకలు, కోళ్ళు కోసుకొని తిన్న నేపథ్యం తెలిసిందే. ఆ సమయంలో అజీర్తి రోగాల నష్టంతో పాటు ఆ తర్వాత తినడానికి ఇళ్ళల్లో వస్తువులు, సరుకులు, పెంపుడు జంతువులు మిగలని దుస్థితి ఏర్పడ్డ చేదు అనుభవాలు తెల్సిందే. అదేవిధంగా ఒకవేళ ఏప్రిల్ ఫస్టు నుంచి కార్మికులు కట్టుబానినలు కాకతప్పదని స్వయంగా కార్మికవర్గాన్ని ముందుకు నడిపించే నాయకత్వ స్థానాల్లోని ఆర్గనైజర్లు బోధిస్తే, కలిగే నష్టాలు మన దృష్టిలో వుండాలి. ఏప్రిల్ ఫస్టు నుంచి తమను ఎలాగూ ఇక కట్టుబానిసత్వంలోకి లేబర్ కోడ్సు యీడ్చుతున్నప్పుడు, తామే స్వచ్ఛందంగా యాజమాన్యాల ఎదుట లొంగిపోవడం మంచిదనే భయభీతులు కార్మికుల మనస్సులలో ఏర్పడే ప్రమాదం కూడా వుంది. పౌర్ణమి కాలపు వెన్నెల రాత్రులతో పాటు అమావాస్య కాలపు చీకటి రాత్రులలో కూడా తమ పంట పొలాల్లో పని చేయడానికి రైతులు అలవాటు పడతారు. ట్రేడ్ యూనియన్ల ఆర్గనైజర్లు, రాజకీయ శ్రేణులు కూడా యిలాగే రెండు రకాల భౌతిక పరిస్థితులకు అనుగుణంగా కార్మిక సంఘాలను నిర్మాణం చేసే అనుభవ జ్ఞానాన్ని పొందగలగాలి. లేబర్ కోడ్స్ వల్ల ఏప్రిల్ ఫస్టు నుంచి గాడాంధకార యుగంలోకి కార్మికవర్గం నెట్టబడుతున్నదంటూ కార్మిక సంఘాల ప్రతినిధులే అదే పనిగా ప్రచారం చేయడం వల్ల నిజంగానే కార్మికవర్గం తీవ్ర నిరుత్సాహానికి గురయ్యే ప్రమాదం వుంది. ఈ దృష్టి కోణం కార్మికవర్గ విప్లవ సంస్థలకు వుండాలి.

రానున్న చీకట్ల పట్ల, వాటి నష్టాల పట్ల ఖచ్చితంగా వెలుతురు రాజకీయ శక్తులు ప్రచారం చేయాల్సిందే. కానీ, చీకట్ల వల్ల కలిగే నష్టాల గూర్చి చేపట్టే ప్రచార సరళి వెలుగుల కోసం సాగించబోయే వుద్యమ నిర్మాణానికి ఉపయోగపడే విధంగా వుండాలి. అంతేతప్ప, ఇక తాము చీకట్ల నుంచి బయటపడలేమనే నిరాశ కలిగించరాదు. చీకట్లలో బ్రతకడానికి

మానసికంగా సర్దుబాటు చేసుకొనుటకు అవకాశం యివ్వరాదు. అంతేకాక కార్మికవర్గానికి మార్చి 31 వరకూ స్వర్ణయుగం కొనసాగినట్లు భావన కలిగించడానికి, ఏప్రిల్ ఫస్టు నుంచి మాత్రమే చీకటి యుగం ప్రారంభం అవుతుందని సంకేతం పంపే పరిస్థితికి చోటు ఇవ్వరాదు. ఆ తరహా ప్రచారం చేసే వారికి తెలియకుండానే ఇలా ఒక తప్పుడు సందేశాన్ని కార్మికవర్గ మనస్సుల్లోకి పంపే అవకాశం వుంది. ఈ ప్రమాదం పట్ల తగు జాగ్రత్తలను కార్మికవర్గ విప్లవ సంస్థల ఆర్గనైజర్లు తీసుకోవాలి.

మేలులో కీడును, కీడులో మేలును చూడగలిగే దృష్టికోణం కార్మికవర్గ విప్లవ సంస్థలకు వుండాలి. వెలుతురులో చీకట్లు; చీకట్లలో వెలుతురు దాగి వుండటం సహజమైనది. ఈ రెండు పార్శ్వాల పట్ల కార్మికవర్గ విప్లవ సంస్థలకు స్పష్టమైన అవగాహన వుండాలి. ఈ దృష్టికోణం లోపిస్తే ఒకసారి ఎడమ వైపుకూ, మరోసారి కుడి వైపుకూ మొగ్గే అవకాశం వుంది. ఇలా సమతుల్యతను కోల్పోయిన సందర్భాల్లో బాధిత కార్మికవర్గాన్ని సమతూక భావంతో ముందుకు నడిపించడం సాధ్యం కాదు. వారికి ఆచరణలో ఎదురయ్యే ఆటంకాలు, అవరోధాల్ని అధిగమించలేరు. తత్ఫలితంగా గతంలో భారత కార్మికోద్యమం కొన్ని నిర్ణీత, నిర్దిష్ట కాలాలలో కొన్ని పెదధోరణులకు గురై నష్టపోయిన నేపథ్యం కూడా వుంది.

1950 దశాబ్దంలో నెహ్రూ సర్కార్ ప్రభుత్వ రంగ వ్యవస్థను నిర్మాణం చేసింది. కార్మికవర్గానికి మెరుగైన కార్మిక చట్టాల రూపకల్పన చేసింది. అందుకు ప్రధానంగా రెండు ప్రాథమిక కారణాలు వున్నాయి. అంతవరకూ భారత కార్మికవర్గం సాగించిన అశేష త్యాగాల నేపథ్యం ఒక కారణం. ఆనాడు అంతర్జాతీయ స్థాయిలో సోషలిజం ఒక రాజకీయ శక్తిగా ఉండడంతో పాటు విస్తరణ స్వభావంతో పురోగమిస్తూ వుండే నేపథ్యం మరో కారణం. ఈ రెండు నేపథ్యాలు లేకుండా కార్మికవర్గం పట్ల నెహ్రూ సర్కార్ అలాంటి సానుకూల చర్యలను చేపట్టలేదు. లెనిన్ ఒక సందర్భంలో చెప్పిన మాటను గుర్తుచేయాలి. కార్మికవర్గ పోరాటాల ఫలితంగా దోపిడీ సర్కార్లు సైతం చట్టబద్ధ హక్కులు లేదా ప్రజాస్వామిక అవకాశాల్ని కల్పించితే, వాటిని సద్వినియోగం చేసుకుంటూ, తమ విప్లవ లక్ష్య సాధనా దిశలో పురోగమించాలని లెనిన్ చెబుతాడు. అంతేతప్ప, అట్టి అవకాశాలకు చట్టబద్ధత కల్పించిన బూర్జువా పాలకవర్గాల పట్ల కార్మికవర్గంలో ఆశలను పెంచే వైఖర్లును చేపట్టరాదని స్పష్టంగా చెప్పాడు. ఆ దృష్టితో చూస్తే మిగిలిన రంగాల కార్మికవర్గానికి నిజానికి ప్రభుత్వరంగ కార్మికవర్గం దారిదీపంగా వుండాలి. కానీ, భారతదేశంలో ప్రభుత్వరంగ కార్మిక, ఉద్యోగ వర్గాలు నెహ్రూ సర్కార్ తన స్వీయ సంకల్పంతో ప్రభుత్వ రంగ సంస్థల్ని నిర్మాణం చేసిందనే భావనకు లోనైంది. ఫలితంగా, అట్టి ఆశలు ముదిరి ఒక దశలో భ్రమల రూపాన్ని కూడా తీసుకున్నది. నిజానికి స్వదేశీ, విదేశీ పీడితవర్గ ప్రజల అశేష త్యాగఫలంగా ఉనికిలోకి వచ్చిన ప్రభుత్వరంగం, కార్మికవర్గ సంక్షేమ వ్యవస్థలను నెహ్రూ ప్రభుత్వ ఉదార విధానాల ఫలితంగా మన దేశ ప్రభుత్వరంగ కార్మికవర్గం భావించింది. ఫలితంగా, లెనిన్ చెప్పిన రీతిలో విప్లవపథంలో మరింత పురోగమించే లక్ష్యం కోసం ఆనాటి ప్రభుత్వరంగ వ్యవస్థ, సంక్షేమ విధానాలు ఒక మెట్టుగా సద్వినియోగం కాలేదు. తద్భిన్నంగా వాటిని నెహ్రూ ప్రభుత్వం నిర్మించిందనే భావనకు గురైనది. నెహ్రు తర్వాత వచ్చిన ప్రభుత్వాలు కూడా కొనసాగించిన ప్రభుత్వరంగ వ్యవస్థ అనే స్వర్గాన్ని పి.వి., మన్మోహన్ సర్కారు 1990 తర్వాత కూల్చిందనే భావనకు గురైనది. ఆ భావనలో భ్రమలు దాగి వున్న చేదు నిజాన్ని కూడా మరిచిపోరాదు.

మరో నిర్దిష్ట దశలోని మరో చేదు అనుభవాన్ని కూడా గుర్తుచేస్తున్నా. కార్మిక సంక్షేమం రీత్యా, వారి హక్కుల పరంగా ప్రైవేటురంగ, ముఖ్యంగా అసంఘటిత రంగ కార్మికవర్గానికి తొలి కాలంలో ప్రభుత్వరంగ కార్మికవర్గం ఆదర్శంగా వుండేది. భవిష్యత్తులో తమ హక్కుల సాధన కోసం ఆదర్శంగా చూసే రంగంగా వుండేది. కానీ, 1990లలో మరో సర్కార్ వచ్చి ప్రభుత్వరంగాన్ని ప్రైవేటీకరణ చేయడానికి పూనుకుంటే, కార్మికవర్గం ఎదిరించి పోరాడలేని పరిస్థితి ఏర్పడింది. పోరాట మార్గం కంటే, ప్యాకేజీలతో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసే ధోరణికి ప్రధానంగా గురైనది. నెహ్రూ సర్కార్ తమ కోసం నిర్మించిన స్వర్గాన్ని తర్వాత పి.వి. నర్సింహారావు ప్రభుత్వం కూల్చుతుందనే ధోరణికి గురైనది. 1950లలో ఒక రకం తప్పుడు ధోరణికి గురైనది. 1990లలో మరో తప్పుడు ధోరణికి గురైనది. నిజానికి పై రెండు రాజకీయ ధోరణులూ కవల పిల్లల వంటివే. వాస్తవానికి 1950లలో నిర్మాణమైన ప్రభుత్వరంగం భౌతిక స్వర్గం కాదు. అది ఊహాజనిత లేదా భ్రమాజనిత స్వర్గం మాత్రమే. అది మాత్రమే 1990ల్లో కూల్చివేతకు గురైనది. ఇలాంటి ఓ భావదారిద్ర్యం భారత కార్మికోద్యమంలో ఒక బలమైన రాజకీయ పెదధోరణిగా క్రమంగా బలపడింది. ఫలితమే ప్రభుత్వరంగ కూల్చివేత ప్రక్రియ సునాయాసంగా రాజ్యం చేపట్టగలిగింది. అందువల్ల ప్రైవేటు రంగ కార్మికవర్గానికి, మరీ ముఖ్యంగా అసంఘటిత రంగ కార్మికవర్గానికి ఈ దేశ ప్రభుత్వరంగ కార్మికవర్గం ఆదర్శంగా నిలబడలేకపోయింది. పైగా, ప్రభుత్వరంగ పరిరక్షణ కోసం గత మూడున్నర దశాబ్దాల నుండి కొనసాగుతున్న ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటాల్లో ప్రభుత్వరంగ కార్మిక, ఉద్యోగ వర్గాల శ్రేణులు నామమాత్ర పాత్ర పోషించాయి. ఆ డిమాండ్‌తో ప్రత్యక్ష

ప్రమేయంలేని ప్రైవేటు రంగ కార్మికవర్గ, మరీ ముఖ్యంగా అసంఘటిత రంగ కార్మికవర్గ శ్రేణులే క్రియాశీలంగా పాల్గొన్న నేపథ్యం వుంది. ఈ రాజకీయ బలహీనతకు మూలకారణాన్ని ఆయా ప్రభుత్వరంగ సంస్థల కార్మికవర్గంలో గానీ, వాటి రాజకీయ శ్రేణుల్లో గానీ చూడటం శాస్త్రీయ దృష్టికాదు. నిజానికి భారత కార్మికోద్యమ సార్వజనీన గమనంలో దాని మూలకారణాన్ని చూడాలి.

మరో మూడున్నర దశాబ్దాలు గడిచింది. నేడు ప్రైవేటురంగ కార్మికవర్గంతో సహా సమస్త శ్రామికవర్గం మీద లేబర్ కోడ్స్ అనే బుల్డోజర్లతో మోడీ సర్కారు నిర్ణయాత్మక దాడికి దిగింది. ఈసారి దాడికి ప్రధాన బాధిత వర్గం కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ వంటి కార్మికవర్గం కావడం గమనార్హం! 1950ల కాలంలో నామమాత్రంగా కాంట్రాక్టు కార్మికవర్గం వుండేది. అది 1990ల తర్వాత క్రమక్రమంగా పెరుగుతూ వచ్చింది. దానికి వేలువిడిచిన తోబుట్టువుగా అవుట్ సోర్సింగ్ కార్మిక, ఉద్యోగ వర్గాలు ఉనికిలోకి వచ్చాయి. ఈ సోదరుల జంటే నేడు భారత కార్మికోద్యమానికి పొటెన్షియల్ శక్తిగా మారింది. అది ఎంత అనూహ్య స్థాయిలో పెరిగిందో కరోనా కాలపు వలస కార్మిక విషాద గాథ బట్టబయలు చేసింది. దానిమీద 12 గంటల పనిదినాన్ని కార్పొరేట్ రాజ్యవ్యవస్థ అధికారికంగా రుద్ది అమలుచేయడానికి నడుం బిగించింది. అది ప్రభుత్వ, ప్రైవేటు రంగాలకు చెందిన కీలక రంగాలలో కూడా అమలుకు దిగింది. పైగా పారిశ్రామిక ప్రమాదాలకు బలౌతున్న ప్రధాన బాధితవర్గంగా కూడా మారింది. వాస్తవానికి పూర్వ తరాల కార్మికవర్గ త్యాగాల ఫలితాలను అనుభవించడంలో ఏడు దశాబ్దాల క్రితం భారత కార్మికవర్గంలో మీగడ పొర (క్రీమీ లేయర్) గా ప్రభుత్వరంగ కార్మికవర్గం ఆవిర్భవించింది. అట్టి పూర్వతరాల కార్మికవర్గ త్యాగాల వారసత్వాన్ని కొనసాగించడంలో ఆ ప్రభుత్వరంగ కార్మికవర్గం నిజానికి ముందుభాగాన వుండాలి. ఒకవేళ లెనిన్ ఆశించిన విధంగా విప్లవ పథంలో రాజకీయ పురోగమనం కొనసాగి వుంటే, అది అలాంటి పాత్ర పోషించి వుండేది. ఏమైనా తన చారిత్రక పాత్రను పోషించడంలో అది విఫలమైంది. దాని గర్భంలో పిలకలు పెట్టిన కాంట్రాక్టు కార్మికవర్గంతో సహా సకల ప్రైవేటు రంగాలలో కాంట్రాక్టు కార్మికవర్గం భారతదేశ కార్మికవర్గంలో నేడు కీలక విభాగంగా రూపొందింది. పైగా అవుట్ సోర్సింగ్, స్కీమ్స్ కార్మికవర్గంతో సహా ఉద్యోగ భద్రతలేని కార్మికవర్గం ప్రాథమిక భౌతికశక్తిగా మారింది. వారికి ఇంతవరకూ తమ ఉద్యోగ భద్రత కోసం, జీవన పరిస్థితుల మెరుగుదల కోసం నేటి కార్మిక చట్టాలను ఆలంబనగా చేసుకొని పోరాడే కొన్ని పరిమిత అవకాశాలు వున్నాయి. ఆ నిర్దిష్ట నేపథ్యంలో ప్రస్తుత కార్మిక చట్టాలను రద్దుచేసి, నగ్నంగా కార్పొరేట్ వ్యవస్థకు సేవచేసే లేబర్ కోడ్స్ ని మోడీ సర్కారు తెచ్చింది. ఇప్పుడున్న పరిమిత చట్టబద్ధ హక్కులు, అవకాశాలను సైతం రద్దు చేయడం లేబర్ కోడ్స్ లక్ష్యం!

లేబర్ కోడ్స్‌కి ఇలాంటి చీకటి కోణం వున్నమాట నిజం. కార్మికవర్గాన్ని చీకట్లకు గురిచేసే లక్ష్యం వుండటం నిజం. అదే సమయంలో లేబర్ కోడ్స్ సృష్టించే అదనపు చీకట్ల వెనుక కార్మికవర్గాన్ని వెలుతురు వైపు నడిపించే మరో కోణం కూడా వుంది. కీడులో దాగిన మరో మేలును గుర్తించగలిగే రాజకీయ అవగాహన కార్మికవర్గ విప్లవ సంస్థలకు విధిగా వుండాలి. ఆ దృష్టికోణం వుంటే, కార్మికవర్గంలో ఆత్మవిశ్వాసాన్ని పెంచగలిగే అవకాశం బలంగానే వుంటుంది.

లేబర్ కోడ్స్ కేవలం కార్మికవర్గ హక్కులు, సౌకర్యాలను మాత్రమే రద్దుచేయవు. కార్మిక చట్టాల పట్ల, కార్మికశాఖ పట్ల కార్మికవర్గంలో మానసికంగా ఇప్పటి వరకూ కొనసాగుతున్న అనేక ఆశలతో పాటు, భ్రమలను కూడా రద్దు చేస్తాయి. హక్కులనూ, సౌకర్యాలనూ కోల్పోయే కార్మికవర్గం నష్టపోయేది తక్కువేమీ కాదు. అదే సమయంలో లేబర్ కోడ్స్ ఉనికిలోకి రావడంతో పూర్వ కార్మిక చట్టాల పట్ల కార్మికవర్గంలో ఇంతవరకూ కొనసాగే ఆశలు, భ్రమల రద్దు కూడా జరుగుతుంది. హక్కులు, సౌకర్యాల రద్దుతో కార్మికవర్గం కోల్పోయే నష్టాల కంటే, కార్మికుల్లోని ఆశలు, భ్రమలు తొలగడం వల్ల రాజ్యం కోల్పోయే నష్టం అనేక రెట్లు ఎక్కువ వుంటుంది. కార్మిక చట్టాల మీద; కార్మికశాఖ మధ్యవర్తిత్వం మీద ఆశలు, భ్రమలు కలిగి వుండటంతో నిజానికి పెట్టుబడిదారీ వర్గంతో ప్రత్యక్ష ముఖాముఖి పోరాటానికి కార్మికవర్గం దిగడానికి ఇంతవరకూ పూనుకునేది కాదు. కానీ లేబర్ కోడ్స్ అమలు తర్వాత అనివార్యంగా భౌతిక పరిస్థితులలో మౌలిక మార్పు వస్తుంది. అలా ఏర్పడనున్న కొత్త భౌతిక పరిస్థితుల్లో రేపు మధ్యవర్తిత్వశాఖ మీద కార్మికవర్గం ఆశలు కోల్పోతుంది. ఫలితంగా సమస్యల మీద ప్రత్యక్ష తక్షణ పోరాటాలకు దిగే చైతన్యం పెరుగుటకు దారితీస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే, పెట్టుబడికీ, శ్రమశక్తికీ మధ్య ముఖాముఖి వర్గపోరాటాలకు కొత్త భౌతిక ప్రాతిపదిక ఏర్పడుతుంది. ఈ సందర్భంగా ఒక మాట చెప్పాలి. లేబర్ కోడ్స్ అమలు చేయడానికి రెండు నెలల ముందు నుంచే కార్పొరేటు వర్గాల దూకుడు విధానాలు పెరిగాయి. ఫలితంగా దేశ వ్యాపితంగా కార్మికవర్గ (ముఖ్యంగా కాంట్రాక్టు కార్మికవర్గ) పోరాటాలు తీవ్రరూపం ధరించాయి. అందులో ఎనిమిది గంటల పని దినం, ప్రమాదాల నుంచి భద్రతా చర్యలు వంటి రాజకీయ కోర్కెలు ప్రధానంగా ముందుకు రావడం విశేషం. మరో ప్రత్యేక వ్యాసంలో వాటిని ఉదహరిద్దాం.

ఈ వెలుగులో కార్మికవర్గ విప్లవ సంస్థల దృష్టి కోణం వుండాలి. లేబర్ కోడ్స్ వల్ల కార్మికవర్గం కోల్పోయే నష్టాల కంటే, శ్రమదోపిడీ రాజ్యమే ఎక్కువ నష్టపోతుందనే రాజకీయ అవగాహన వుండాలి. ఈ స్పష్టమైన రాజకీయ అవగాహనను తమ సంస్థల రాజకీయ శ్రేణులకు కార్మికవర్గ విప్లవ సంస్థలు అందించాలి. భవిష్యత్తు పట్ల కార్మికవర్గంలో ఆశా, విశ్వాసాలు కలిగించాలి. ఏప్రిల్ ఫస్టు నుంచి కొత్త చరిత్ర నిర్మాణ దారిలో ముందడుగు వేయాలని ఆకాంక్షించుదాం!

## సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుంద రెడ్డి



తెలంగాణ సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్‌గా జి ముకుంద రెడ్డి బాధ్యతలు స్వీకరించారు ప్రస్తుతం స్పెషల్ కమిషనర్‌గా ఉన్న ప్రియాంకను బదిలీ చేయడంతో జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ గా ఉన్న ముకుందరెడ్డిని సమాచార శాఖ ప్రత్యేక కమీషనర్‌గా నియమించారు. ఆయన నియామకం పట్ల నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు తెలంగాణ శాఖ కన్వీనర్ ఎం.ఎ.రవూఫ్ హర్షం వ్యక్తం చేశారు.



# జర్నలిస్టులకు సంపూర్ణ సహకారం

## విశాఖ జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

విశాఖ జిల్లాలో వర్కింగ్ జర్నలిస్టులకు తమ వంతు సంపూర్ణ సహకారం అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ అభిసిక్త్ కిషోర్ అన్నారు. ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, బ్రాడ్ కాస్ట్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్లకు చెందిన పలువురు జర్నలిస్టు నేతలు జిల్లా కలెక్టర్‌ను ఆయన చాంబర్‌లో ఏప్రిల్ 23న మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు విశాఖ జిల్లా అధ్యక్షులు పి నారాయణలు జర్నలిస్టులకు సంబంధించిన పలు అంశాలను జిల్లా కలెక్టర్‌కు విపులంగా వివరించారు. జిల్లాలో జర్నలిస్టులందరికీ హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం సి ఎస్ ఆర్ నిధులతో జిల్లా అధికార యంత్రాంగం ద్వారా చెల్లించాలని కోరారు. గతంలో కూడా పలువురు కలెక్టర్లు ఈ విధంగానే చెల్లించారని వీరు తెలియజేశారు. ఇందులో వెటరన్ జర్నలిస్టులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు గంట్ల శ్రీను బాబు నారాయణలు తెలిపారు.. అలాగే పెండింగ్ అక్రిడేషన్లు, ఇతర అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని తాము కోరడం జరిగిందన్నారు.. జర్నలిస్టుల అన్ని పెండింగ్ సమస్యలను తెలుసుకుని దశలవారీగా పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇవ్వడం జరిగిందని వీరు చెప్పారు. ఈ సందర్భంగా జర్నలిస్టు నాయకులు కలెక్టర్‌కు సింహాద్రి నాథుడి జ్ఞాపిక అందించి ఘనంగా సత్కరించారు. అలాగే ఏపీ వర్కింగ్ జర్నలిస్టులు ఫెడరేషన్ రాష్ట్ర డైరీని జిల్లా అధ్యక్షులు నారాయణ కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాడ్ కాస్ట్ అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు కార్యదర్శి కింతాడ మదన్, చిన్న మధ్యతరహా పత్రికల సంఘం అధ్యక్షులు జగన్మోహన్, బొబ్బర ప్రసాద్, ఫెడరేషన్ ఉపాధ్యక్షులు ఎన్. రామక్రిష్ణ, పి..నగేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టు రవిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



యు. కొత్తపల్లి మండలంలో ఒక మీడియా సంస్థలో పని చేస్తున్న జర్నలిస్టు మోర్త రవిపై శుక్రవారం రాత్రి కొందరు దుండగులు విచక్షణారహితంగా దాడి చేయడాన్ని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) కాకినాడ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ దాడిలో గాయపడిన రవి ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో కొత్తపల్లి మండలానికి చెందిన విలేకరులు ఎస్ఐ జి. వెంకటేష్‌కు ఏప్రిల్ 18న వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి ముమ్మిడి లక్ష్మణ్, స్థానిక పాత్రికేయులు ఎం. మూర్తి, గంప రాజు, చోడిశెట్టి సతీష్, తోట శాంతి, ఎం. రమణ, ఎం. చక్రధర్, కోకా సతీష్ బాబు, జి.కిషోర్, ఎం. వంశీ, ఆదిమూలం గంగాధర్ రావు, జ్యోతుల రాంబాబు, కృష్ణ తదితరులు మాట్లాడుతూ జర్నలిస్టులపై ఇలాంటి దాడులు జరగడం ప్రజాస్వామ్యానికి ముప్పు కలిగించే చర్యలని అన్నారు. ఇటీవలి కాలంలో జర్నలిస్టులపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఘటనపై పోలీసులు తక్షణమే స్పందించి పూర్తి స్థాయిలో, నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని వారు కోరారు. దాడికి పాల్పడిన వారిని గుర్తించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా జర్నలిస్టుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా మండలంలోని పలువురు విలేకరులు తమ ఆందోళన వ్యక్తం చేస్తూ సంఘీభావం తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో మణికంత, స్టాలిన్, దొరబాబు, బాబీ, రాజశేఖర్ తదితర పాత్రికేయులు పాల్గొన్నారు.




**రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఏసియన్ రిపోర్టర్ బొర్రా అయ్యప్పను పరామర్శించిన ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నాయకులు గుండా రామకృష్ణ, అంతఃపురం నాని, తిరుమల ప్రసాద్,గునిశెట్టి నరసింహమూర్తి ,ఆరేటి శ్రీనివాస్, వేగిరాజు రాధాకృష్ణరాజు, ఇసుకపల్లి రాజేంద్ర, మేడపాటి సాగర్ , కేశిరెడ్డి మాణిక్య తేజ రావు తదితరులు**

# దిగ్గజ ఫోటో జర్నలిస్ట్ మృతి



దిగ్గజ ఫోటో జర్నలిస్ట్ రఘురాయ్ (83) కన్ను మూశారు. ఆయన ఢిల్లీలోని ఆసుపత్రిలో తుది శ్వాస విడిచారు. తన 23 వేట స్టేట్స్ వార్తా పత్రికలో చీఫ్ ఫోటోగ్రాఫర్‌గా ఆయన పాత్రికేయ జీవితం ప్రారంభించారు. ఆధునిక భారత్‌లో బంగ్లాదేశ్ యుద్ధం, ఆ దేశ కాందిశీకుల సమస్య, భోపాల్ గ్యాస్ విషాదం లాంటి కీలక ఘట్టాలను, వారణాసి ఆధ్యాత్మిక వైభవాన్ని ఆయన తన కెమెరాలో బంధించారు. ప్రముఖులు మొదలుకొని సామాన్యుల వరకు అందరినీ తన ఫోటోల్లో సమాన స్థానాన్ని ఇచ్చారు. ఆయన తీసిన ఫోటోలు పలు ప్రముఖ అంతర్జాతీయ పత్రికలలో ప్రచురితమయ్యాయి. బంగ్లాదేశ్ యుద్ధానికి తదనంతర పరిణామాలను ఫోటో వార్తలుగా అందించినందుకు భారత ప్రభుత్వం 1972లో ఆయనను పద్మశ్రీతో గౌరవించింది. యునెస్కో, అమెరికా ప్రభుత్వం నుంచి ఆయన ఉత్తమ ఫోటోగ్రాఫర్ అవార్డులు అందుకున్నారు.

# తెలిదేవర భానుమూర్తి కన్నుమూత



సీనియర్ జర్నలిస్టు, రచయిత, కథకుడు తెలిదేవర భానుమూర్తి మృతి చెందారు. తెలంగాణ మాండలికానికి వన్నెతెచ్చిన మేటి తెలిదేవర భానుమూర్తి. జర్నలిస్టుగా, కాలమిస్టుగా ఆయన రచనలు అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకున్నాయి. భానుమూర్తి ఈనాడు, ఉదయం, వార్త దినపత్రికల్లో పనిచేశారు. ఆయన కాలమ్స్‌లో పలుకుబడి, చల్నెదో బాల్‌కిషన్, నెమలీక ఎంతో ప్రాచుర్యం పొందాయి. భానుమూర్తి మరణం తెలంగాణ మాండలికానికి పెద్దలోటు. జర్నలిస్టులకు ఒక మంచి మిత్రుడ్ని కోల్పోయిన బాధ. ఆయన మరణానికి నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశాయి.



# సీనియర్ జర్నలిస్ట్ కెవికె రామారావు మృతి

పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణానికి సీనియర్ జర్నలిస్టు ఈనాడు విలేఖరిగా రెండు దశాబ్దాలుగా సేవలందించిన కెవికె రామారావు (86) ఇక లేరు. కొద్దిరోజులుగా గుంటూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. నరసరావుపేట లోని పాలపాడు రోడ్డులోని ఆయన నివాసం. రామారావు మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ పల్నాడు జిల్లా నాయకులు బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ఎన్.ప్రసాద్‌లు సంతాపం వ్యక్తం చేశారు. కెవికె మృతి పట్ల నరసరావుపేట పట్టణంలోని వివిధ వర్గాల నాయకులు తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# సీనియర్ జర్నలిస్టు మణి బాబు మృతి



కర్నూలు జిల్లాలో ఏపిడబ్ల్యూజేఎఫ్ సీనియర్ నాయకులు, మీడియా నాడి విలేఖరి మణిబాబు అకాల మృతి చెందారు. ఆయన మృతి పట్ల ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి గోరంట్లప్ప, కేబి శ్రీనివాసులు, జిల్లా సీనియర్ నాయకులు పి. చంద్రయ్య, ఫోటో జర్నలిస్టు సీనియర్ నాయకులు డి హుస్సేన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు టిజి ప్రసాద్, జిల్లా నాయకులు డి చంద్రమోహన్, నగర అధ్యక్ష కార్యదర్శులు శివకుమార్, ఎర్రమలలు సంతాపం వ్యక్తం చేశారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ లో ఎంతో చురుకైన కార్యకర్తగా మణిబాబు పనిచేశారని అన్నారు. ఆయన మృతి జర్నలిస్టు ఉద్యమానికి తీరని లోటు అని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వారు తెలియజేశారు.




















జర్నలిస్టు జగన్మోహన్ రెడ్డి
హత్యకు నిరసనగా
ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యంలో
వివిధ జిల్లాల్లో జరిగిన
ఆందోళనలు





ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి
శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలో
ఆంధ్రప్రదేశ్ వికసిస్తోంది...
ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తోంది
సూపర్ 6
ఆంధ్రకు కొత్త శకం - ప్రతి ఇంటికి ఆనందం
తల్లికి వందనం
ఒకటి నుండి ఇంటర్ వరకు ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15,000లు
77.47 లక్షల మందికి రూ. 10,091 కోట్ల లబ్ధి
అన్న క్యాంటీన్
5 రూపాయలకే రుచి, శుచి కలిగిన ఆహారం
రాష్ట్ర వ్యాప్తంగా 206 అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ
అన్నదాత సుఖీభవ
ప్రతి రైతుకు ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం
46,85,838 మంది రైతులకు లబ్ధి
NTR భరోసా పింఛన్లు
దేశంలోనే అతి పెద్ద సంక్షేమ పథకం
ఏడాదికి రూ.34,000 కోట్లతో రాష్ట్రంలోని నిరుపేదలకు సామాజిక భద్రత
దీపం-2 పథకం
పేదింటి మహిళకు ఏడాదికి 3 వంట గ్యాస్ సిలిండర్లు ఉచితం
ఏడాదికి రూ.2,684 కోట్లతో పథకం అమలు
స్త్రీ శక్తి
RTC బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం
ఏడాదికి రూ.2,000 కోట్లతో అమలు...
2 కోట్ల మందికి పైగా లబ్ధిదారులు
ఆరు స్కీములతో... ఆరోగ్య సంతోష సంపదలతో.. మన ఆంధ్రప్రదేశ్